


తెలుగు ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు. శ్రీ కనకదుర్గమ్మ తల్లి ఆశీర్వాదంతో శాంతి, సుఖసంపద, సంక్షేమం, అభివృద్ధి, పేదల, మహిళల, రైతుల కోసం ప్రభుత్వ పథకాలు విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


గురువారం 02.10.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 | సంచిక - 167 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00


# ప్రతి నెలా పెన్షన్ల పండుగే




**పింఛన్లతో పేదల జీవితాల్లో వెలుగులు తెచ్చాం**

**తుగ్లక్ పాలన పోయింది...ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది**

**4వ తేదీన ఆటో డ్రైవర్ సేవలో పథకానికి శ్రీకారం**

**కరెంటు చార్జీలు పెంచం...ఇంకా తగ్గించే దిశగా చర్యలు చేపడతాం**

**ప్రపంచస్థాయి కంపెనీలకు కేంద్రంగా విశాఖను తయారుచేస్తాం**

**రూ.2 వేల కోట్లతో ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం**

**గజపతినగరం, దత్తి(జర్నలిస్ట్ ఫైల్):** ఒకటో తేదీన పింఛన్ల పంపిణీతో గ్రామాలన్నీ కళకళలాడుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పండుగను రాష్ట్రంలో అమలు చేస్తున్నామని తెలిపారు. పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా బుధవారం విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గం, దత్తి గ్రామంలో సీఎం పర్యటించారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి స్వయంగా పింఛన్లు అందించారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న పొంతూరు అప్పలరాజుకు, ఆయన తల్లికి పింఛను అందజేశారు. అనంతరం ప్రభుత్వ పథకాల అమలు తీరుపై వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. ఒకప్పుడు పండుగ చేసుకోవాలన్నా ఇబ్బందిగా ఉండేదని ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక ప్రజలకు ప్రతి నెలా పండుగ వస్తోందని సీఎం అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత 16 నెలల్లో రూ.48,019 కోట్లు పింఛన్లపై ఖర్చు చేశామని అన్నారు. 'రాష్ట్రవ్యాప్తంగా 63,50,765 మందికి రూ.2,745 కోట్లు పింఛన్ల కింద పంపిణీ చేస్తున్నాం. వృద్ధాప్య పింఛనుదారు చనిపోతే అతని భార్యకు వెంటనే వితంతు పింఛన్ మంజూరు చేస్తున్నాం. ఈ నెలలో కొత్తగా 10,578 మందికి రూ.4.23 కోట్లు వితంతు పింఛన్లు ఇస్తున్నాం. 2 నెలలు పెన్షన్ తీసుకోని 1,34,023 మందికి రూ.108 కోట్లు, 3 నెలలుగా పింఛన్లు తీసుకోని 11,545 మందికి రూ.14 కోట్లు విడుదల చేశాం' అని ముఖ్యమంత్రి తెలిపారు.

**పేదలకు న్యాయం చేయడమే ధ్యేయం :** గత ప్రభుత్వంలో ఒకటి రెండు నెలలు పింఛను తీసుకోకపోతే రద్దు చేసేవాళ్లని, ప్రజా ప్రభుత్వంలో పేదలకు న్యాయం చేయాలనే ఏకైక ధ్యేయంతో రెండు నెలలు పింఛను తీసుకోకపోయినా మూడో నెల ఇస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. 'లబ్ధిదారులు ఎక్కడుంటే అక్కడికి వెళ్లి పింఛను అందిస్తున్నాం. ఒక్క విజయనగరం జిల్లాలోనే ప్రతీ నెలా 2,75,682 మందికి రూ.117 కోట్లు పింఛన్ల రూపంలో ఇస్తున్నాం. గజపతినగరం నియోజకవర్గంలో 39,641 మందికి రూ.17 కోట్లు అందిస్తున్నాం.

మిగతా 2లో...

# రూ.100కే భూముల రిజిస్ట్రేషన్

- వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ పై ప్రభుత్వం చల్లని చూపు..!
- రూ.10 లక్షల లోపు ధర ఉంటే 100కే రిజిస్ట్రేషన్
- లబ్ధి పొందనున్న లక్షలాది కుటుంబాలకు లాభం
- సీఎం నిర్ణయం అమలయితే ఎంతో లాభం
- ఈ భూములకు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ పై ఆలోచన
- సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చే దిశగా కసరత్తు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్) :** వారసత్వంగా వచ్చే. ఆస్తుల రిజిస్ట్రేషన్ చార్జీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే దిశగా ఆలోచన చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది పేద కుటుంబాలకు భరోసా ఇచ్చేలా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం రూ.100కే వారసత్వ రిజిస్ట్రేషన్లు చేయాలని భావిస్తున్నారు.

రూ.10 లక్షల లోపు ఆస్తులకు రూ.100, పైబడితే రూ.1,000 ఫీజు చొప్పున వసూలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం అమలు చేస్తే లక్షలాది మందికి ప్రయోజనం దక్కుతుందని భావిస్తున్నారు. అయితే రెవెన్యూ అధికారులు మాత్రం పూర్వికుల ఆస్తులకు మాత్రం గత కొన్ని సంవత్సరాలు నుంచి భూమిశిస్తూ వసూలు చేస్తూనే ఉన్నారు. వారసుల పేరు మీద రసీదులు ఇస్తూనే ఉన్నారు. భూములను. మాత్రం ఉన్నవారసుల పేరున మార్చటం కుదరదని తేల్చి చెబుతున్నారు .

రాష్ట్రంలో భూమి కలిగిన పట్టాదారుల్లో పూర్వీకులు చాలామంది లేరు. దీనివల్ల వాళ్ళ ఆస్తులు వారి పేరు నే ఉండటం, వాటిని పేరు మార్చుకునే అవకాశం లేకపోవడం వల్ల ఎంతోమంది వారసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొంతమంది పూర్వీకుల ఆస్తులు చుక్కల భూమిలో నమోదయ్యాయి.

మిగతా 2లో...

డబుల్ ఇంజన్ సర్కార్‌తో

# డబుల్ సంక్షేమం : ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్):** డబల్ ఇంజన్ సర్కార్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అనుకూలమైన విధానాలను ముందుకు తీసుకు వెళుతూ, అభివృద్ధి, సంక్షేమంతొ, మెరుగైన పాలన అందిస్తుందని, పట్టణంలోని 30 వ వార్డులో పెన్షన్లు పంపిణీ కార్యక్రమం ప్రారంభ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. తెనాలి మండలం, హాఫ్ పేట, కొల్లిపర మంలంలోని తూములూరు, పట్టణములోని 30 వ వార్డులో బుధవారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ వృద్ధాప్య వితంతు పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉమ్మడి గుంటూరుజిల్లా జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీక్రిష్టీన, కత్తెర సురేష్ కుమార్ లతో కలిసి వృద్ధాప్య వితంతు పెన్షన్లను అర్హులైన వృద్ధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో, రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన ప్రయోజనాలను చేరువచేసే దిశగా జీఎస్టీ లో, సవరణలు జరిగాయని అన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందన్నారు. పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వ విధానమన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్న తీరును వివరించారు. రైతుబంధు పథకం ద్వారా రైతులు కల్పిస్తున్న ఆర్థిక భరోసా సంవత్సరానికి 40 వేల వరకు అందిస్తున్నట్లు తెలిపారు. జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హేనీ క్రిస్టీన మాట్లాడుతూ

మిగతా 2లో...

# తెలుగు రాష్ట్రాలకు 8 కేంద్రీయ విద్యాలయాలు మంజూరు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం పండుగ పూట తీపికబురు చెప్పింది. ఈ మేరకు ఇవాళ జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో దేశ వ్యాప్తంగా 57 నూతన కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. వాటి నిర్మాణాలకు రూ.5,863 కోట్ల నిధులు కేటాయించేందుకు ఆమోద ముద్ర వేశారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌కు 4, తెలంగాణకు

మిగతా 2లో...

# సోషల్ మీడియాలో అరాచకాలను అరికట్టేందుకు మంత్రుల కమిటీ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గత కొంతకాలంలో రాష్ట్రంలో దుష్ప్రచారాలు ఎక్కువయ్యాయి. ఇందుకు సోషల్ మీడియా వేదికగా నిలుస్తోంది. ఫేక్ ప్రచారాలు సైతం హల్ చల్ చేస్తున్నాయి. ముఖ్యంగా పార్టీలు, రాజకీయ నాయకులను కొందరు కించపరుస్తూ, ఇష్టమొచ్చినట్లు వ్యాఖ్యలు,

మిగతా 2లో...

# గూగుల్ డేటా సెంటర్‌కు ఆటంకం కలిగిస్తే ఉపేక్షించం



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** గూగుల్ డేటా సెంటర్ కోసం భూ సేకరణలో రైతులకు తెలీకుండా కోర్టులో తప్పుడు కేసులు ఫైల్ చేసిన ఉదంతంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం విశాఖ ఎయిర్ పోర్టులో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ సీఎంకు స్వాగతం పలికిన అనంతరం డేటా సెంటర్ భూ సేకరణ ప్రగతిని.. ఆ ప్రాంత రైతుల అభిప్రాయాలను సీఎంకు వివరించారు. ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టుకు ఆటంకాలు సృష్టించే ఆలోచనతో వైకాపా పెద్దల తరఫున పని చేస్తున్న బినామీ విషయంలో గట్టి చర్యలకు సీఎం ఆదేశించారు.

రైతులకు తెలీకుండా వారి పేర్లతో కోర్టులో కేసు వేయడం.. ఆ పేర్లలో మృతి చెందిన రైతు పేరు ఉండడం పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. భూములిచ్చిన రైతులకు ఉద్యోగావకాశాలు, ఉపాధి కోసం షాపింగ్ కాంప్లెక్స్, ఇళ్ల నిర్మాణానికి 3 సెంట్ల స్థలం గురించి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. భూసేకరణ ప్రాంతాల్లో ఒకసారి పరిహారం ప్రకటించిన తర్వాత దాన్ని పెంచడమనేది ఎక్కడా లేదని.. కేవలం ఇక్కడి రైతుల అభ్యర్థన దృష్టిలో ఉంచుకుని ధర పెంచామనే విషయాన్ని గ్రహించాలని సీఎం పేర్కొన్నారు. త్వరితగతిన భూ సేకరణ పూర్తి చేయాలని సూచించారు.

# రాజమహేంద్రవరం-తిరుపతి విమాన సర్వీసు ప్రారంభం




**దిల్లీ (జర్నలిస్ట్ ఫైల్ ):** రాజమహేంద్రవరం నుంచి తిరుపతికి విమాన సర్వీసును పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రారంభించారు. దిల్లీలోని రాజీవ్‌గాంధీ భవన్ నుంచి ఎంపీ పురందేశ్వరితో కలిసి వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు ఆదిశ్రీనివాస్, బుచ్చయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మిగతా 2లో...

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పెంపు... చరిత్రాత్మక నిర్ణయం



**ఏలూరు/ఆగిరిపల్లి,(జర్నలిస్ట్ ఫైల్):** ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం – డాక్టరు బి.ఆర్.అంబేద్కర్, బుద్దగూడెం కాలనీలలో బుధవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు ప్రతి గడపకు వెళ్ళి, వారి యోగక్షేమాలు, ఆరోగ్య పరిస్థితులు, గ్రామానికి ఇంకా అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకుని, లబ్దిదారులకు పెన్షన్లు సొమ్మును రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సంయుక్తంగా అందజేశారు. ముందుగా బుద్దగూడెం కాలనీ వద్ద బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రం మీద రూ 14 లక్షల కోట్ల అప్పులు భారం పెట్టినా,

మిగతా 2లో...

# జిఎస్టి తగ్గింపుతో మేలు

- ప్రజారోగ్యంపై వ్యయంలో రూ.1,000 కోట్లు ఆదా!
- సామాన్యులపై రూ.750 కోట్లు, ప్రభుత్వంపై రూ.250 కోట్లు వరకు ఉపశమనం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** జీఎస్టీ పన్నుల తగ్గింపుతో రాష్ట్ర ఆరోగ్య రంగంలో సుమారు రూ.1,000 కోట్లు వంకు ఆదా కానుంది. ప్రాణధార మందులపై తగ్గించిన పన్నుతో ప్రజలు నేరుగా కొనుగోలుచేసే మందులు, సర్జికల్స్పై రూ.716 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జరిగే కొనుగోళ్లలో రూ.250 కోట్లు వరకు వ్యయం తగ్గుతుందని అంచనా వేస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన కొనుగోళ్ల ఆధారంగా ఇకపై సుమారు రూ.1,000 కోట్లు వరకు ప్రజారోగ్యంపై భారం తగ్గుతుందని అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదలచేశారు 'ఈ నెల 21వ తేదీ వరకు 12%, 5% చొప్పున మందులపై జీఎస్టీ ఉండేది 12% కేటగిరిలోనే 99% మందులు ఉన్నాయి. 12% పన్నును 5%కు కేంద్రం తగ్గించింది. దీనివల్ల ప్రస్తుత మందులపై 7% వరకు పన్ను తగ్గింది. క్యాన్సర్, ఇతర అరుదైన కేటగిరిలో ఉన్న 33 రకాల మందులపై 12% వరకు ఉన్న పన్నును కేంద్రం పూర్తిగా తొలగించింది. దీనివల్ల ప్రజారోగ్యానికి భారీ ఊరట లభించింది' అని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

**రాష్ట్రంలో 35,000 మందుల దుకాణాలు :** "రాష్ట్రంలో సుమారు 35 వేల వరకు మందుల దుకాణాలు, 5 వేల వరకు టోకు వర్తక సంస్థలు ఉన్నాయి. వీటి ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో 11,250 కోట్ల విలువైన మందులు, సర్జికల్స్ విక్రయాలు జరిగాయి. దీని ప్రకారం రూ.1,350 కోట్లు వరకు పన్నుల భారం ప్రజలపై పడినట్లు రాష్ట్ర ఔషధ నియంత్రణ పరిపాలనా విభాగం తెలిపింది. ఇకపై ప్రజలు నేరుగా మందుల కొనుగోలు చేయడంపై పడే జీఎస్టీ భారంలో రూ.703 కోట్ల వరకు ఆర్థిక భారం తగ్గింది.

మిగతా 3లో...

## సంపాదకీయం

# లడఖ్ ఆందోళనలు అసలు సమస్య ఎక్కడ?

లడఖ్ ఆందోళనలు ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. కేవలం మూడు లక్షల జనాభా గల ఈ ప్రాంతంలో యువత పెద్దఎత్తున వీధులకెక్కడం, పోలీసుల కాల్పుల్లో నాలుగు ప్రాణాలు కోల్పోవడం సాధారణ విషయం కాదు. బిజెపి దీనికి తమ రాజకీయ ప్రత్యర్థులే కారణమని వాదిస్తోంది. అయితే అసలు సమస్యను జాగ్రత్తగా పరిశీలిస్తే స్పష్టమవుతుందిలడఖ్‌లో నిరసనల మూలకారణం మాత్రం నిరుద్యోగమే.

లడఖ్ విద్యా రంగంలో అక్షరాస్యత శాతం గణనీయంగా ఉన్నా, చదువుకు తగ్గ ఉపాధి అవకాశాలు మాత్రం కనిపించడం లేదు. పురుషుల అక్షరాస్యత 89 శాతం, మహిళల్లో 65 శాతం ఉన్నప్పటికీ, విద్యా వనరులు పరిమితంగానే ఉన్నాయి. ఉపాధ్యాయుల తరచూ బదిలీల వల్ల గ్రామీణ బోధన మరింత దెబ్బతింటోంది. అయినప్పటికీ స్థానిక పిల్లలు చదువుకు ప్రాధాన్యం ఇస్తుండటం అక్కడి సామాజిక విలువలకు అద్దం పడుతోంది.

వ్యవసాయ పరంగా కూడా లడఖ్ వెనుకబడే పరిస్థితి కనిపిస్తుంది. వర్షపాతం లేకుండా హిమనదుల కరిగే నీటిపైన ఆధారపడే వ్యవసాయం, పరిమిత పంటలుబార్లీ, గోధుమ, బఠానీలుతోనే సాగుతోంది. పశుపోషణ, ఉన్ని, పాలు వంటి సంప్రదాయ వృత్తులు ఉన్నా, ఆధునిక వ్యవసాయ పద్ధతుల్ని అవలంబించడంలో వెనుకబాటు కనిపిస్తోంది.

లడఖ్ ప్రధాన ఆర్థిక వనరు పర్యాటకం. హిమాలయ పర్వతాలు నుంచి పాంగోంగ్ సరస్సు అందాలు వరకూ విదేశీ పర్యాటకులను మైమరిపిస్తాయి. అయినప్పటికీ అక్కడి మౌలిక సదుపాయాలు బలహీనంగానే ఉన్నాయి. ముఖ్యంగా నీటి కొరత సమస్య ఆర్థిక వనరుకే భారీ ఆటంకమవుతోంది. వేసవిలో మంచు పర్వతాలు కరిగిపోవడం, పర్యాటకుల గిరాకీ పెరిగే సమయానికే తీవ్ర నీటి సమస్య తలెత్తడంతో స్థానికుల జీవనాధారమే దెబ్బతింటోంది.

ఇందులో ఆందోళన కలిగించే అంశం నిరుద్యోగం. 2021-22లో 534 ఉద్యోగాలకు 50,000 మంది దరఖాస్తులు రావడం పరిస్థితిని అద్దం పట్టింది. 2022-23లో నిరుద్యోగం రేటు 26.5 శాతం దాటింది. ఇది జాతీయ సగటుతో పోలిస్తే రెండింతల స్థాయిలో ఉంది. చదువుకున్నా పని లేక యువత వీధుల్లోకి రావడం సహజం.

ఇంత గంభీరమైన సమస్య ఉన్నప్పటికీ జాతీయ మీడియా మాత్రం అసలు అంశాన్ని పక్కన పెట్టి రాజకీయాలకే ప్రాధాన్యం ఇచ్చింది. నిరసనల్లో కాంగ్రెస్ కౌన్సిలర్ పాల్గొనడాన్ని హైలెట్ చేయడం, ఉద్యమానికి కారణాలు దాచిపెట్టడం ప్రజాస్వామ్యంలో మీడియా వైఫల్యమని చెప్పాలి. లడఖ్ ప్రజలు కోరుకుంటున్నది కేవలం ప్రత్యేక రాష్ట్ర హోదా కాదు, వీరు తమ భవిష్యత్తు కోసం 6వ షెడ్యూల్ కింద రాజ్యాధికారాలు, భూమి రక్షణ, చట్ట పరిపాలనకు స్వయం ప్రతిపత్తినే కోరుతున్నారు.

2019లో జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దయిన తర్వాత లడఖ్ ప్రజల ఆందోళన మరింత ముదిరింది. సరిహద్దు ప్రాంతం కావడంతో కేంద్రం భద్రతపైనే దృష్టి కేంద్రీకరించి ప్రజల సామాజిక-ఆర్థిక సమస్యలను పక్కన పెట్టింది. ఇది కేవలం బీజేపి పాలనలోనే కాదు, గత ప్రభుత్వాల వైఖరులలో కూడా కనిపించే నిర్లక్ష్యం.

లడఖ్ యువత నిరసనలు స్పష్టమైన సందేశం ఇస్తున్నాయి. సమస్యలను పక్కదారి పట్టించడం కాదు, ఉపాధి సృష్టి, నీటి వనరుల అభివృద్ధి, విద్యా వనరుల బలోపేతం, ప్రత్యేకహోదా విషయంలో స్పష్టత ఇవ్వడయివే అవసరం. లేనిపక్షంలో పొరుగునున్న నేపాల్, శ్రీలంక మాదిరిగానే లడఖ్‌లో కూడా అశాంతి కాలం కొనసాగుతూనే ఉంటుంది.

**- అజయ్ చంద్ర, ఎడిటర్, జర్నలిస్ట్ ఫైల్**

# ప్రతి నెలా పెన్షన్ల పండుగే

(మొదటి పేజీ తరువాయి)

దత్తి గ్రామంలో 706 మందికి నెలకు రూ. 29 లక్షలు పింఛన్ల కోసం ఖర్చు చేస్తున్నాం. ఎన్టీఆర్ 1985లో రూ. 30తో పింఛను పథకాన్ని ప్రారంభించారు. నేను 1995లో ముఖ్యమంత్రి అయినప్పుడు దాన్ని రూ. 75 చేశాను. 2014లో రూ. 1000, తర్వాత రూ. 2000 వేలకు పెంచాను అని ముఖ్యమంత్రి అన్నారు.

**దేశంలో అధిక పింఛన్లు ఇచ్చే రాష్ట్రం ఏపీనే :** మనదేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పింఛను ఇవ్వడంలేదని ముఖ్యమంత్రి అన్నారు. పింఛన్ల పంపిణీ బాధ్యతగా చేపట్టాం. మానవత్వంతో ఆలోచిస్తున్నాం. రూ. 4,000 నుంచి రూ. 15,000 వరకు వివిధ రకాల పెన్షన్లు ఇస్తున్నాం. పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రతి నెలా ఒక జిల్లాకు వచ్చి స్వయంగా పంపిణీ చేస్తున్నాను. ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రం కూడా పెన్షన్ల కోసం ఏడాదికి ఖర్చు చేస్తుంది కేవలం రూ. 5,160 కోట్లు మాత్రమే. తెలంగాణలో ఏడాదికి రూ. 8,179 కోట్లు ఇస్తుంటే మన రాష్ట్రంలో ఏడాదికి రూ. 32,143 కోట్లు ఖర్చు చేస్తున్నాం. నెలనెలా పెన్షన్ తీసుకుంటున్న వారిలో 59 శాతం మంది మహిళలు ఉన్నారు. ఇప్పటి వరకు పింఛన్ల కోసం 16 నెలల్లో ఖర్చు చేసిన రూ. 48,019 కోట్లలో రూ. 28,331 కోట్లు మహిళలకు ఇస్తున్నందుకు సంతోషంగా ఉంది అని ముఖ్యమంత్రి అన్నారు.

**మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశాం :** సూపర్ సిక్స్ పథకాల అమల్లో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 'ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం అమలు చేస్తున్నాం. ఇందుకోసం రూ. 10,090 కోట్లను 63.77 లక్షల మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేశాం. ఆడబిడ్డలకు వంటింటి కష్టాలు తీర్చాలని దీపం పథకాన్ని అమలు చేస్తున్నాం. ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. పథకం వల్ల ఏడాదిలో కోటికి పైగా కుటుంబాలు ప్రయోజనం పొందాయి. 2.66 కోట్ల సిలిండర్లు సబ్సిడీపై అందించాం. దీనికి రూ. 1,718 కోట్లు ఖర్చు పెట్టాం. స్త్రీ శక్తి పథకాన్ని ఆగస్ట్ 15న ప్రారంభిస్తే 45 రోజుల్లోనే దగ్గర దగ్గరగా మహిళలు10 కోట్ల ప్రయాణాలు చేయడం నాకు ఆనందంగా ఉంది. ఈ పండుగ సీజన్ లో అన్ని దేవాలయాల్లో మహిళా భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. పథకం అమల్లో భాగంగా నెలకు రూ. 247 కోట్లు, ఏడాదికి రూ. 2,963 కోట్లు స్త్రీ శక్తి కోసం



ఖర్చు చేస్తున్నాం అని ముఖ్యమంత్రి తెలిపారు.

**ఈనెల 4న 'ఆటో డ్రైవర్ సేవలో' పథకం :** డ్రైవర్ల కష్టాలు నాకు తెలుసు కాబట్టే వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు పథకం తెస్తున్నామని సీఎం అన్నారు. ఉచిత బస్సు పథకం వల్ల ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు ఆదాయం తగ్గకుండా ఉండేందుకు ఈ నెల 4న ఆటో డ్రైవర్ సేవలో పథకానికి శ్రీకారం చుడుతున్నాం. ఒక్కో ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ. 15,000 ఆర్థిక సాయం ఇస్తాం. దాదాపు 2.90 లక్షల మంది ఆటోడ్రైవర్లు ఈ పథకానికి అర్హులుగా గుర్తించాం. ఈ పథకం అమలుకు ఏడాదికి రూ. 435 కోట్లు ఖర్చు చేస్తున్నాం. పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి ఒక్కో రైతుకూ రూ. 20,000 ఇస్తున్నాం. సూపర్ సిక్స్ లో మొదటి హామీ మెగా డీఎస్సీ. ఎన్నికల ప్రచారంలో చెప్పినట్టే అధికారంలోకి రాగానే మొదటి సంతకం పెట్టి ఏడాదికే టీచరు పోస్టులు ఇచ్చాం. 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి యువతకు నేను అండగా ఉంటాను. వివిధ ప్రభుత్వ విభాగాల్లో 9,093, పోలీస్ శాఖలో 6,100 ఉద్యోగాలు భర్తీ చేశాం. వర్క్‌ఫ్రమ్ హోమ్ కింద ఇప్పటికే 5,500 మందికి ఉపాధి కలుగుతోంది. ఈ 15 నెలల్లో 4,71,574 మందికి ఉద్యోగాలు దక్కేలా చేశాం అని ముఖ్యమంత్రి తెలిపారు.

**2029 నాటికి రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఇల్లు :** 2029 నాటికల్లా రాష్ట్రంలో ప్రతీ ఒక్కరికీ ఇల్లు కట్టించే బాధ్యత తనదని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పటికే 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని, వచ్చే ఏడాది జూన్ కల్లా మరో 6 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. 'రాష్ట్రంలో అందరి ఆకలి తీర్చేలా 204 అన్న క్యాంటీన్లు పనిచేస్తున్నాయి. యూనివర్సల్ హెల్త్ పాలసీ త్వరలో తీసుకువస్తున్నాం. అందరికీ రూ. 2.5 లక్షలు మేర ఆరోగ్య బీమా అందిస్తాం. దీంతో రాష్ట్రంలోని 1.63 కుటుంబాలకు ఆరోగ్య భద్రత లభిస్తుంది. పేదలకు రూ. 25 లక్షల వం-కూ ఉచితంగానే వైద్యం అందిస్తాం. జీఎస్టీ సంస్కరణల వల్ల పేద, మధ్య తరగతి వర్గాలకు ఉపయోగపడేలా ధరలు తగ్గి కొనుగోలు శక్తి పెరిగింది. జీఎస్టీ తగ్గింపుతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం దాదాపు రూ. 8 వేల కోట్లు తగ్గుతుంది. అయినప్పటికీ జీఎస్టీ 2.0ను స్వాగతిస్తూ శాసన సభలో తీర్మానం చేశాం. కారణం... పేద, మధ్యతరగతి ప్రజలకు రూ. 8 వేల కోట్ల మేర ప్రయోజనం కలుగుతుంది అనేది మా ఆలోచన. కొత్త శ్లాబుల వల్ల ప్రతి కుటుంబానికి...ప్రతినెలా రూ. 1000 నుంచి రూ. 1500 వరకు ఆదా అవుతుంది అని సీఎం తెలిపారు.

**భవిష్యత్ లోనూ కరెంటు చార్జీలు పెంచబోం :** ఎన్డీఏ ప్రభుత్వంలో కరెంటు చార్జీలు పెంచబోమని, వీలైతే తగ్గించే చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి తెలిపారు. 'సమర్థ నిర్వహణతో విద్యుత్ రంగాన్ని గాడిన పెట్టాం. గత ప్రభుత్వంలో 9 సార్లు కరెంటు ఛార్జీలు పెంచి రూ. 32 వేల కోట్ల భారం ప్రజలపై వేశారు. దేశ చరిత్రలో తొలిసారి ట్రూడౌన్ తో విద్యుత్ చార్జీల భారం తగ్గిస్తున్నాం. నవంబర్ నుంచి యూనిట్ కు 13 పైసలు తగ్గుతాయి. పిఎం కుసుమ్ స్కీంలో భాగంగా రైతులకు, పిఎం సూర్యఘర్ కింద ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తున్నాం. బీసీలకు గరిష్టంగా రూ. 98 వేలు సబ్సిడీ ఇస్తున్నాం అని ముఖ్యమంత్రి తెలిపారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధి బాధ్యత నాది :** ఉత్తరాంధ్రను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తనదని ముఖ్యమంత్రి అన్నారు. 'ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసమే భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మిస్తున్నాం. గత పాలకుల వల్ల భోగాపురం ఎయిర్ పోర్టు ఆలస్యమైంది. 2026 ఆగస్టు నాటికి విమానాశ్రయాన్ని ప్రారంభిస్తాం. విజయనగరం పేదరికం ఎక్కువగా ఉన్న జిల్లా. వంశధార, నాగావళి, తోటపల్లి, తారకరామ తీర్థసాగర్ సహా అనేక ప్రాజెక్టులు మేమే ప్రారంభించాం. రాబోయే రెండేళ్లలో ఉత్తరాంధ్రలో రూ. 2 వేల కోట్ల వ్యయంతో ప్రాజెక్టులు పూర్తిచేస్తాం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తిచేసి గోదావరి నుంచి వంశధారకు అనుసంధానం చేయడం వల్ల నీటి ఎద్దడి తీరుతుంది. రూ. 25 కోట్ల వ్యయంతో సార్వగడ్డ మినీ రిజర్వాయర్ రెండేళ్లలోగా పూర్తిచేసి నీరు అందిస్తాం. మత్స్యకారులకు జెట్టీ కట్టిస్తాం. శాసనాపల్లికి హై లెవల్ బ్రిడ్జ్ మంజూరు చేస్తాం. మర్రివలస నుంచి గజపతినగరం వరకూ నూతన రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తాం. అటు విశాఖ నగరానికి టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్ డేటా సెంటర్ వస్తున్నాయి. సెంట్రల్ యూనివర్సిటీకి సమీపంలోనే ట్రైబల్ యూనివర్సిటీ కూడా నిర్మాణమవుతోంది. రూ. 1.47 లక్షల కోట్లతో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. విశాఖ, రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవేతో దేశమంతటా రవాణాకు కనెక్టివిటీ మెరుగవుతుంది అని ముఖ్యమంత్రి తెలిపారు.

**సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం :** గతంలో పాలకులు వస్తున్నారంటే పరదాలు కట్టేవారని, సభకు వచ్చినవాళ్లు వెళ్లకుండా గోతులు తవ్వేవారని ముఖ్యమంత్రి అన్నారు. 'గత ప్రభుత్వంలో ప్రజలు స్వేచ్ఛగా ఉండే పరిస్థితులు లేవు. 2024లో ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వచ్చింది. కొన్ని పార్టీలకు మంచి పనులు చేయడం రాదు. ఇతరులు చేస్తే తట్టుకోలేరు. అడుగడుగునా అడ్డుకునే కుట్రలు చేస్తారు. తప్పుడు వార్తలు ప్రచురిస్తారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తారు. అలాంటి వారి ఆటలు సాగవు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే అదే వారికి చివరిరోజవుతుంది అని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

**శ్రీవారి ఆశీస్సులతో ముందుకు :** నాపై 24 క్లైమోర్ మైన్స్ పేల్చితే... సాక్షాత్తు ఆ వెంకటేశ్వర స్వామే ప్రాణభిక్ష పెట్టాడు. ఆ స్వామి ఆశీస్సులతో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్తాను. ఆనాడు ఎన్టీఆర్ తిరుమలలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత టీటీడీ ఆధ్వర్యంలో నడిచే అన్ని దేవాలయాల్లోనూ అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ప్రాణదానం ట్రస్ట్ కింద రూ. 688 కోట్ల నిధులను సమీకరించి తిరుపతిలో ఉండే ఆస్పత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యం అందిస్తాం. రాష్ట్రంలో 17 లక్షల శ్రీవారి సేవకులు ఉన్నారు. బ్రహ్మోత్సవాలు విజయవంతంగా జరుగుతున్నాయంటే అందులో సేవకుల కృషి కూడా ఉంది. విదేశాల్లో ఉంటున్న మన తెలుగు డాక్టర్లు ఓ వారం రోజులు తిరుపతిలో పేదలకు వైద్యం చేసి శ్రీవారి దర్శనం చేసుకోమని నేను పిలుపునిచ్చాను. దేశవ్యాప్తంగా 5 వేల శ్రీవారి ఆలయాలను నిర్మిస్తున్నాం. అలాగే మసీదులు, చర్చిలు కట్టుకోవడానికి ప్రభుత్వపరంగా నిధులు మంజూరు చేస్తున్నాం అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

# రూ.100కే భూముల రిజిస్ట్రేషన్

(మొదటి పేజీ తరువాయి)

ఇలాంటి సమస్యలతో అనేకమంది ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. లక్షలాది మంది జీవించి లేరు. కానీ వారి పేర్లతోనే ఇప్పటికీ పట్టాలు కొనసాగుతున్నాయి ఇది రైతులకు పెద్ద సమస్యగా మారింది. వెబ్‌ల్యాండ్ రికార్డుల ప్రకారం రాష్ట్రంలో మొత్తం 84,63,764 మంది పట్టాదారులు ఉన్నారు. వారిలో 3,91,405 మంది ఇప్పటికే మరణించారు. అంటే మొత్తం పట్టాదారుల్లో 4.58% మంది జీవించి లేరు. ఈ భూములు వారసుల అనుభవంలోనే ఉన్నప్పటికీ వారి పేర్లతో బదిలీ కాలేదు. ఈ పరిస్థితి తీవ్ర సమస్యగా మారింది. ఈ భూములను విక్రయించుకోవాలన్నా, కట్నకానుకల కింద ఇవ్వలన్నా, బ్యాంకుల్లో కుదువ పెట్టి లోన్లు తీసుకోవాలన్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ఈ. భూములు తమ వేనని చెప్పుకోవడం తప్ప వారికి హక్కు ఉండటం లేదు. ఎన్నాళ్ళున్నా ఆ భూములను సాగు చేసుకోవడం తప్ప ఎలాంటి ప్రయోజనాలకు వాడుకునే అవకాశం లేకుండా పోయింది. కొన్ని జిల్లాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లాల వారీగా పరిస్థితిని నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందించారు. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 6.92%, అన్నమయ్య జిల్లాలో 6.69%, చిత్తూరు, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో 6.44%, విజయనగరం, తిరుపతి జిల్లాల్లో 6.15% చొప్పున మృతుల పేర్లతోనే పట్టాలు ఉన్నాయి. కుటుంబ పెద్ద చనిపోయి ఏళ్లయినా వారసులు ఆస్తిని తమ పేర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి..

**ఎందుకు రిజిస్ట్రేషన్ కాలేదు?:**

ప్రస్తుతం వారసత్వ భూములను రిజిస్టర్ చేయించుకోవాలంటే 1% స్టాంపు రుసుము చెల్లించాలి. దశాబ్దాలుగా తమ వద్దే ఉన్న భూములకు మళ్లీ రుసుము కట్టాలన్న ఆవశ్యకతేంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. కొందరికి రుసుము భరించే స్థోమత లేకపోవడం, వల్ల భూముల్లో పేర్లు మారటం లేదు. కుటుంబసభ్యుల మధ్య వాటాల సమస్యలు తేలకపోవడం వల్ల రిజిస్ట్రేషన్లు ముందుకు సాగటం లేని పరిస్థితి కూడా చాలా జిల్లాల్లో ఉంది.. ఇదే కారణంగా పంట రుణాలకు, సంక్షేమ పథకాలకూ రైతులు దూరమవుతున్నారు. అంతేకాదు అనేకమంది రైతులు భూములు కలిగి ఉన్నా ఇంకా ఇంకా పేదవారిగానే. జీవనం సాగిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. ఇటీవల ఈ రికార్డులను పరిశీలించిన ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకొని రైతులకు ఉపశమనం కలిగించేలా ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. అయితే రెవెన్యూ శాఖ మాత్రం ఇలాంటి భూములను పొజిషన్ ఆధారంగా మళ్లీ రిజిస్ట్రేషన్ చేసి యాజమాన్లకు అప్పగించడం మంచిదేనా అభిప్రాయానికి వచ్చి ప్రభుత్వానికి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఈ సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. రూ. 10 లక్షల లోపు విలువైన ఆస్తులకు రూ. 100, రూ. 10 లక్షల పైబడితే రూ. 1,000 మాత్రమే స్టాంపు రుసుము కట్టించి రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రతిపాదన చేశారు. ఈ విధానం త్వరగా అమలైతే లక్షలాది రైతు కుటుంబాలకు ప్రయోజనం దక్కుతుంది.

అయితే ఈ భూములను రిజిస్ట్రేషన్ చేసే విధానంలో కొన్ని మార్పులు తేవాలని కూడా భావిస్తున్నారు. ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లోనే వారసత్వ ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించాలని ఆలోచిస్తోంది. అయితే అక్కడ సిబ్బందికి శిక్షణ, కంప్యూటర్లు, పరికరాలు అవసరం అవుతాయి. వారానికి ఒక్కటి లేదా రెండు మాత్రమే జరిగే రిజిస్ట్రేషన్ల కోసం ఈ వ్యయం చేయాలా అన్న సందేహం రెవెన్యూ వర్గాల్లో ఉంది. పైగా సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసినా మళ్లీ సబ్‌రిజిస్ట్రార్ ఆమోదం తప్పనిసరి అవుతుంది. కాబట్టి నేరుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయడం సులభం అన్న అభిప్రాయమూ ఉంది. ఏ జిల్లాలో చూసినా వారసత్వ భూముల వ్యవహారంలో ప్రభుత్వానికి కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు అందుతున్నాయి. అయితే ప్రభుత్వం నుంచి సరైన నిర్ణయం లేకపోవడం వల్ల వీటిపై ఎలాంటి నిర్ణయము తీసుకోలేక అధికారులు ఆ ఫిర్యాదులను పక్కన పెట్టేస్తున్నారు.

గత ఏడాదిలోనే వారసత్వ భూముల రిజిస్ట్రేషన్‌లపై ప్రభుత్వానికి 76 వేల ఫిర్యాదులు అందినట్లు సమాచారం. కుటుంబ సభ్యుల మధ్య వాటాల పంపిణీ ఎటూ తేలకపోవడంతో పాటు, పలువురు పేర్ల మార్పు పట్ల నిర్లక్ష్యం చూపడం వంటి కారణాలతో ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

**సీఎం నిర్ణయం అమలైతే ప్రయోజనాలు :**

ఈ ప్రతిపాదన అమలైతే రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన సాధ్యమవుతుంది. రైతులు సులభంగా పంట రుణాలు పొందగలరు. సంక్షేమ పథకాలకు అర్హత సాధిస్తారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఇది పెద్ద ఊరట కలిగించే నిర్ణయం కానుంది. మృతుల పేర్లలో ఉన్న పట్టాలను వారసుల పేర్లతో బదిలీ చేస్తే ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వం తీసుకున్న తక్కువ రుసుము రిజిస్ట్రేషన్ పథకం త్వరగా అమలైతే రైతుల సమస్యలు గణనీయంగా తగ్గి, వ్యవసాయ రంగంలో మరింత పారదర్శకత చోటుచేసుకుంటుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిపైరైతుకు ఉపయోగపడేలా నిర్ణయం తీసుకుంటారని ఆలోచనలో అనేక కుటుంబాలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ ఫీజు తగ్గించి వెసులుబాటు కల్పించాలనే. డిమాండు ఎప్పటినుంచో ఉంది.

# రాజమహేంద్రవరం-తిరుపతి విమాన సర్వీసు ప్రారంభం



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ దేవీ నవరాత్రుల్లో తిరుపతికి విమాన సర్వీసులు ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. టికెట్ ధర మొదటి 35 సీట్లకు రూ. 1999, తర్వాత 35 సీట్లకు రూ. 4000 మూడు నెలలపాటు అందుబాటులో ఉంటుందన్నారు. దిల్లీ, ముంబయికి ప్రారంభించిన విమాన సర్వీసులు నిండుగా నడుస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తులో షిర్డీ, వారణాసి, కొచ్చి తదితర ప్రాంతాలకు సర్వీసులు ప్రారంభిస్తామన్నారు.

పురందేశ్వరి మాట్లాడుతూ తిరుపతికి విమాన సర్వీసును ప్రారంభించుకోవడం శుభపరిణామమని చెప్పారు. రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి పలు ప్రాంతాలకు కనెక్టివిటీ పెరుగుతోందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సర్వీసులు ప్రారంభించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

అలయన్స్ ఎయిర్ విమానయాన సంస్థ ఈ విమాన సర్వీసులను నడపనుంది. దీని ద్వారా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వాసులకు ఆకాశయానం ద్వారా ఆధ్యాత్మిక యాత్ర దగ్గరకానుంది. రెండో తేదీ నుంచి షెడ్యూల్ ప్రకారం ఈ సర్వీసు అందుబాటులోకి రానుంది. మంగళ, గురు, శనివారాల్లో అలయన్స్ ఎయిర్ విమానయాన సంస్థ దీన్ని నడపనుంది.

**బాలయోగి జీవితం ఎన్నో తరాలకు ఆదర్శం: రామ్మోహన్ నాయుడు**

దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి జయంతి సందర్భంగా రామ్మోహన్‌నాయుడు నివాళులర్పించారు. పాత పార్లమెంట్ భవనం సెంట్రల్ హాల్‌లో బాలయోగి చిత్రపటం వద్ద ఆయన అంజలి ఘటించారు. బాలయోగి జీవితం ఎన్నో తరాలకు ఆదర్శమని చెప్పారు. కోనసీమ గడ్డ నుంచి ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో లోక్‌సభ స్పీకర్‌గా ఆయన పనిచేసి తెలుగువారి కీర్తిని ఎల్లలు దాటించారన్నారు. ఆయన సేవలు దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సానా సతీశ్, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ ఇంజన్ సర్కార్‌తో డబుల్ సంక్షేమం

(మొదటి పేజీ తరువాయి)

పేద వర్గాల ప్రయోజనాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్దపీట వేస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకటవ తేదీ పండుగ వాతావరణాన్ని తలపిస్తుందన్నారు. జీఎస్టీ విధానములో తీసుకువచ్చిన మార్పులు వల్ల, పేద మధ్యతరగతి కుటుంబాలకు, వారు కొనుగోలు చేసే వస్తువులపై తగ్గింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ కుద్దూస్, షేక్ జానీ, డాక్టర్ వేమూరు శేషగిరిరావు, కే రమాదేవి,తెనాలి, కొల్లిపర, మండలపార్టీ, గ్రామ పార్టీనాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాలకు 8 కేంద్రీయ విద్యాలయాలు మంజూరు

(మొదటి పేజీ తరువాయి)

4 కేంద్రీయ విద్యాలయాలు మంజూరయ్యాయి. ఈ క్రమంలోనే రాష్ట్రానికి కేంద్రీయ విద్యాలయాలు మంజూరు చేయడం పట్ల ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ట్విట్టర్ వేదికగా వేదికగా ధన్యవాదాలు తెలిపారు. కొత్త కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుతో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని లోకేశ్ కామెంట్ చేశారు. ఏపీలో మంగసముద్రం (చిత్తూరు), బైరుగానిపల్లె (కుప్పం), పలాస (శ్రీకాకుళం), శాఖమూరు (అమరావతి)లో, తెలంగాణలో భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జగిత్యాల, వనపర్తి జిల్లాలో కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు.

# సోషల్ మీడియాలో అరాచకాలను అరికట్టేందుకు మంత్రుల కమిటీ


(మొదటి పేజీ తరువాయి)

పోస్టులు పెడుతున్నారు. దీంతో అసత్యాలు చెలరేగిపోతున్నాయి. కొన్ని సమయాల్లో సోషల్ మీడియా పోస్టులు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయి. శాంతి భద్రతల సమస్యలు ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. సోషల్ మీడియాలను నియంత్రించాలని ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా మంత్రుల కమిటీని నియమించింది. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఈ కమిటీ పని చేయనుంది. ఈ కమిటీ సభ్యులుగా మంత్రులు అనిత, సత్యకుమార్, నాదెండ్ల, పార్థసారథి పని చేయనున్నారు. తప్పుడు ప్రచారం, మిస్‌ఇన్ఫర్మేషన్, నేషనల్ సెక్యూరిటీ ముప్పులపై చర్చించి చర్యలకు సిఫారసులు చేయనున్నారు. పౌర హక్కుల పరిరక్షణకు మంత్రుల కమిటీ సూచనలు ఇవ్వనున్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పెంపు... చరిత్రాత్మక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకునేలా ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ఒకేసారి పెన్షన్లు పెంచి, మూడు నెలలు ఏరియర్సుతో కలిపి అందజేసామన్నారు. ప్రతినెల 01వ తేదీ ఉదయాన్నే ప్రతి గడపకు వెళ్ళి పెన్షన్లు సొమ్మును పంపిణీ చేస్తున్నామని, లబ్ధిదారులు ముఖంలో చిరునవ్వు, కళ్ళల్లో ఆనందంతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి ఆశీస్సులు అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో పెన్షన్లు దారులకు పంపిణీ చేసే సొమ్ము ఇతర రాష్ట్రాలతో పోలిస్తే పదిరెట్లు ఎక్కువ అని, దేశంలోనే మన రాష్ట్రం అత్యధిక పెన్షన్లు పంపిణీలో ప్రథమస్థానంలో ఉన్నామన్నారు. 01వ తేదీనే నూటికినూరుశాతం పెన్షన్లు దారులకు పెన్షన్లు పంపిణీ చెయ్యడానికి జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందని అన్నారు. ప్రతినెల మొదటి రోజునే సామాజిక పెన్షన్లు దారులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుకు కూడా జీతాలు అందిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం



సంవత్సరానికి రూ 250 రూపాయలు మాత్రమే పెన్షన్లు సొమ్ము పెంచేవారని, మన ప్రజా ప్రభుత్వంలో విడతలు వారీ కాకుండా ఒకేసారి పెంచి మూడు నెలలు బకాయిలు కలిపి లబ్ధిదారులకు అందజేశామని అన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు జీతాలు పెంచమని మాట అటుంచి మాకు జీతాలు 01వ తారీఖున ఇవ్వండి మహా ప్రభో అనేవారని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులు కుప్పగా చేస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి అండగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో మన ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిస్తున్నామని అన్నారు.

జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో సామాజిక పెన్షన్లు అందజేస్తున్నదని, సద్వినియోగం చేసుకుని మంచి ఆరోగ్యంతో సమాజంలో గౌరవంగా జీవించాలని అన్నారు. పింఛన్లను ఇంటింటికీ వెళ్ళి పంపిణీ చేసేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఏరాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద మొత్తంలో పెన్షన్లు అందజేయడం జరుగుచున్నదని, లబ్ధిదారులు భవిష్యత్తు అవసరాలు కోసం కొంతపొదుపు చేసుకోవాలని సూచించారు. 01వ తేదీనే నూరుశాతం పెన్షన్లు దారులకు పెన్షన్లు పంపిణీ చేయడం జరుగుతుందని, అనివార్య కారణాలచేత 1వ తేదీన తీసుకొని పెన్షన్లుదారులు 03వ తేదీన పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని 5175 మంది సచివాలయ మరియు ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో పెన్షన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, యంపిడివో బి. భార్గవి, డిప్యూటీ తహశీల్దారు జి. పవన్ కుమార్, మండల వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, వివిధరకాలు సామాజిక పింఛన్లుదారులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# జిఎస్టి తగ్గింపుతో మేలు

(మొదటి పేజీ తరువాయి)

ఇవి కాకుండా క్యాన్సర్, ఇతర అరుదైన మందుల కొనుగోళ్లు రాష్ట్రంలో రూ.112 కోట్ల వరకు ఉంటుందని అంచనా వీటిపై 12% పన్ను పూర్తిగా తొలగించినందున సుమారు రూ.13 కోట్ల వరకు బాధితులకు ఉపశమనం లభిస్తుందని అంచనా. సదరు సంస్థలు ఖరారుచేసే ఎంఆర్పీల్లోనే జీఎస్టీ ఇమిడి ఉంది. తాజాగా 12% జీఎస్టీని 5%కు తగ్గించినందున ఎంఆర్పీ ధర 6% నుంచి 7% వరకు తగ్గింది. ఈ కేటగిరిలోనే 99% మందులు ఉన్నాయి" అని మంత్రి సత్యకుమార్ వివరించారు.

**ఔషధ నియంత్రణ పరిపాలనా విభాగం పేర్కొన్న ప్రకారం.... :** "పారాసిటమాల్ ఒక షీట్ ధర ఈ నెల 21వ తేదీ వరకు 12% జీఎస్టీతో కలిపి రూ.28గా ఉంది. తగ్గిన జీఎస్టీతో కొత్త ధర రూ.26.04. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉపయోగించే మెటఫార్మిన్ 500ఎంజీ (గ్రెసిఫేజ్) రూ.41.65 నుంచి రూ.38.73 (–రూ.2.92 పైసలు)

రక్తపోటు అదుపునకు ఉపయోగించే టెల్మిసార్టన్ –40 ఎంజీ రూ.113.7 నుంచి రూ.105.74 (–రూ.7.96 పైసలు)కు తగ్గింది. అగ్యుమెంటిన్ 625 ఎంజీ (యాంటీబయాటిక్) రూ.204.86 నుంచి రూ.190.51 (–రూ.14.35)కు తగ్గింది.

మధుమేహ వ్యాధిగ్రస్తులు వినియోగించే హ్యూమన్ ఇన్సులిన్ ధర రూ.454 నుంచి రూ.422.02(–రూ.31.08)కు చేరింది.

పాంటాప్–40 లాంటి గ్యాస్ట్రిక్ ట్యాబెలెటు షీటు ధర రూ.170 నుంచి రూ.158.10 (–రూ.11,900కు తగ్గింది 33 రకాల మందులపై 12% పన్ను పూర్తిగా తొలగించారు.

క్యాన్సర్, ఇతర అరుదైన మందుల ధరలపై జీఎస్టీని పూర్తిగా తొలగించారు. దీనిప్రకారం ఫెజిలాటెడ్ లైపోజోమాల్ (ఓనీవైడ్) ఇంజక్షన్ (వయల్) ధర రూ.4,80,000గా ఉంది. కొత్త ధర రూ.4,28,570 దీనివల్ల బాధితుడికి రూ.51,430 ఆదా అయింది.

దారాటూమాబ్ 35,000(డార్టాలెక్స్–ఫాసిప్రో800ఎంజీ) ఇంజక్షన్ (వయల్) ధర ఈ నెల 21వ తేదీ వరకు 2,30,150గా ఉండేది. దీని ధర ప్రస్తుతం 2,10,450 అయింది ఆదా రూ.28,700.

ఇమిగ్లిసిరేజ్ (సెరిజైమ్) ఇంజక్షన్ (వయల్) పై ఉన్న 5% జీఎస్టీని తొలగించినందున రూ.3,70,000 నుంచి రూ.3,52,381కు అందుబాటులోనికి వచ్చింది.

**ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టుకు రూ.203.85 కోట్లు ఆదా! :** ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.4,077 కోట్లు విలువైన ప్రీ ఆథరైజేషన్లు ఇచ్చారు. ఇందులో రూ.2,308.56 కోట్లు మెడికేషన్, కన్జుమబుల్స్ కింద ఉన్నాయి. ప్రస్తుతం తగ్గిన ధరలవల్ల రూ.203.85 కోట్లు వరకు ఆదా అవుతుందని అంచనా.

**మందులు, సర్జికల్ కొనుగోళ్ల ద్వారా రూ.40 కోట్లు! :** "రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాలు, అభివృద్ధి సంస్థ తరపున 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.679 కోట్లతో మందులు, సర్జికల్ ఐటమ్స్, ఇంప్లాంట్లు, డయాగ్నస్టిక్ కిట్లు, ఇతర వాటిని కొనుగోలుచేశాం. ఇందులో రూ.71 కోట్లు జీఎస్టీ కింద చెల్లిందాం జీఎస్టీ–2.0 కారణంగా ఈ రూ.71 కోట్లులో రూ.40 కోట్లు ఇకపై చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఇలా పరిశీలిస్తే.. ప్రతి ఏడాది జీఎస్టీ సంస్కరణల వల్ల సగటున రూ.250 కోట్లు వరకు ఆదా అవుతుందని అంచనా వేస్తున్నాం " అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వివరించారు.

## సూపర్ జి.ఎస్.టి - సూపర్ సేవింగ్స్ తో రైతులకు మేలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** సూపర్ జి.ఎస్.టి – సూపర్ సేవింగ్స్ తో రైతులకు మేలు కలుగుతుందని పశు సంవర్ధక శాఖ సంయుక్తసంచాలకులు కె.వి.వి సత్యనారాయణ అన్నారు. సూపర్ జి.ఎస్.టి – సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమం తక్కెళ్ళపాడు రైతు సేవా కేంద్రంలో బుధవారం జరిగింది ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఆధునిక పనిముట్లపై ఉన్న 12, 18 శాతం జి.ఎస్.టి 5 శాతానికి తగ్గిందన్నారు. 18 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం కలిగిన సెమి ట్రైలర్ (రోడ్డు ట్రాక్టర్లు మినహా) ట్రాక్టర్లుకు 12 శాతం నుండి ఐదు శాతానికి, ట్రాక్టర్ టైర్లు, ట్యూబులు, ట్రాక్టర్ భాగాలు – బ్రేకులు, గేర్ బాక్స్, క్లచ్, చక్రాలు, స్టీరింగ్, రేడియేటర్, సైలెన్సర్, హైడ్రాలిక్స్, ఫెండర్లు మొదలైన వాటిపై 18 నుండి 5 శాతానికి జిఎస్టి తగ్గిందన్నారు. హార్వెస్టర్లు/ నూర్పే యంత్రాలు, భాగాలు., నేల తయారీ, సాగు యంత్రాలు, కోళ్ల పెంపకం, తేనెటీగల పెంపకం యంత్రాలు, స్ప్రింక్లర్లు, బిందు సేద్యం, చేతిపంపులు, కంపోస్టింగ్ యంత్రాలుపై 12 శాతం నుండి ఐదు శాతానికి తగ్గిందని వివరించారు. కొత్త జీఎస్టీ వల్ల రైతులకు హెక్టారు విస్తీర్ణంలో కూరగాయలు, మిరపకాయలు, మొక్కజొన్న పంటలకు రూ.5 వేలు, అరటి, బొప్పాయి, మల్లె, పత్తి పంటలకు రూ 3,500, కో కో, జామ, అధిక సాంద్రత మామిడి పంటలకు రూ.1700, నిమ్మ, చీని, జీడి మామిడి పంటకు రూ.1800 రూపాయలు, మామిడి, కొబ్బరి, సపోటా పంటకు రూ.1500, ఆయిల్ పామ్ కు రూ .1800, వేరుశనగ, పప్పు ధాన్యాలకు రూ.1414 ప్రయోజనం కలుగుతుందన్నారు.

**ంపశు సంవర్ధక వస్తువులపై 5, 0 శాతంలి :** సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా పశుసంవర్ధక రంగంలో కొన్ని వస్తువులపై 12 నుండి ఐదు శాతానికి జీఎస్టీ తగ్గించడం జరిగిందని, కొన్ని వస్తువులపై ఉన్న ఐదు శాతం జీఎస్టీని పూర్తిగా రద్దు చేయడం జరిగిందని సత్యనారాయణ చెప్పారు. కొన్ని రకాల పాలు, పాల ఉత్పత్తులు, మాంస ఉత్పత్తులు, గడ్డి కత్తిరించే యంత్రాలు, జంతు కొవ్వులు – నూనెలు, బయోగ్యాస్ ప్లాంట్ తదితర అంశాలపై 12 నుండి ఐదు శాతానికి తగ్గించడం జరిగిందని తెలిపారు. కొన్నిరకాల పాలు, పాల ఉత్పాదకాలు, పశు ఔషధాలు, పశు వైద్య పరికరాలపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఆధునిక వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## 19 ఆర్.ఓ ప్లాంట్‌లు తాత్కాలికంగా సీజ్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** గుంటూరు జిల్లా గ్రామీణ ప్రాంతంలో 19 ఆర్.ఓ ప్లాంట్ లు తాత్కాలికంగా సీజ్ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ తెలిపారు. బుధవారం తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామ పంచాయతీ, గుడివాడ గ్రామ పంచాయతీ, తుళ్ళూరు మండలం అనంతవరం, తుళ్ళూరు, లింగయపాలెంలలో గల మొత్తం 19 ఆర్.ఓ ప్లాంట్ లను తాత్కాలికంగా సీజ్ చేసి నోటీసులు జారీ చేసామని వెల్లడించారు.

# అమెరికా షట్‌డౌన్..!

- **ఆరేళ్లలో ఇదే తొలిసారి**
- **2018-19. మధ్యకాలంలో 35 రోజులు మూత**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్)** కీలకమైన బిల్లులకు ఆమోదం లభించకపోవడంతో అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్‌ను ఎదుర్కొంటోంది. ఆరేళ్ల తర్వాత తొలిసారి ఇలా జరిగింది. అర్ధరాత్రి గడువుకు ముందే రెండు నిధుల బిల్లులను సెనెట్ ఆమోదించకపోవడంతో అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్‌లోకి వెళ్లింది. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మొదలుకాగానే(భారత కాలమానం ప్రకారం ఉదయం 9.30కి) ఈ ప్రక్రియ ప్రారంభమైంది.

తమ డిమాండ్లు నెరవేర్చని రిపబ్లికన్ స్టాపేజ్ ఫండింగ్ బిల్లును డెమోక్రాట్లు అడ్డుకోవడంతో ఈ షట్‌డౌన్ మొదలైంది. దీంతో అత్యవసరం కాని సేవల కార్యకలాపాలు నిలిచిపోతాయి. అమెరికాలో లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. దాదాపు 7,50,000 మందిని పని ప్రదేశంలో రిపోర్టు చేయవద్దంటారు. మిలిటరీ, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వంటి విభాగాల్లోని లక్షల మంది సిబ్బంది మాత్రం అత్యవసర సేవలు కొనసాగించాల్సి ఉంటుంది. వీరితో సెలవుల్లో కూడా పని చేయించుకొని చెక్ ఇవ్వని పరిస్థితి ఉంటుంది. షట్‌డౌన్ ముగిశాకే.. వారికి పాత వేతనాల చెల్లింపులు జరుగుతాయి. కొన్ని కాంట్రాక్టుల్లో ఈ చెల్లింపులకు ఎలాంటి హామీలు ఉండవని తెలిపింది.

**ఈ.విభాగాలపై ప్రభావం.. :** సోషల్ సెక్యూరిటీ, మెడికేర్ లబ్ధిదారులపై దీని ప్రభావం ఉండదు. వీరికి సంబంధించిన ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రత్యేక చట్టం రూపంలో ఆమోదం తెలుపుతుంది. వీటికి వార్షిక చెల్లింపులు అవసరం లేదు. కానీ, సోషల్ సెక్యూరిటీ ఆఫీస్‌లు అందించే ప్రయోజనాలు పరిమితంగా ఉంటాయి. నేషనల్ పార్క్ సర్వీసులు మూతపడతాయి. 2013లో వందలకొద్దీ పార్కులు, మ్యూజియంలు, ఇతర ప్రదేశాలను మూసేశారు.

ఈ.మూసివేత వల్ల వెంటనే ఆర్థిక ప్రభావం పడకపోయినా.. దీర్ఘకాలంగా కొనసాగితే మాత్రం ఆర్థిక వృద్ధి మందగిస్తుంది. మార్కెట్లకు అంతరాయం కలిగిస్తుంది. ఇవన్నీ ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. అయితే 2018లో జరిగిన షట్‌డౌన్‌తో ఈసారి కాస్త తీవ్రత ఎక్కువగా ఉండొచ్చని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ షట్‌డౌన్‌లో ఉన్న ప్రతివారం ఆర్థిక వృద్ధిలో 0.1 నుంచి 0.2 పాయింట్లు తగ్గొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం చట్టసభ సభ్యుల్లో రాజీ సూచనలు కనిపించడం లేదు. అమెరికాలో షట్‌డౌన్ మొదలైతే ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేము. 1981 నుంచి అమెరికా ప్రభుత్వం 15 సార్లు మూతపడింది. 2018–19 మధ్య దాదాపు 35 రోజుల పాటు మూతపడగా.. నాడు ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నారు.

# రాష్ట్రంలో మహిళా పోలీసులకు ప్రభుత్వం బంపర్ ఆఫర్

- **తమకు నచ్చిన శాఖను ఎంచుకోవచ్చు**
- **హెూం శాఖలో కూడా పనిచేసే అవకాశం**
- **రాష్ట్రంలో గ్రామ వార్డు సచివాలయాల్లో 13,500 మంది మహిళ పోలీసులు**

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** ఆంధ్రప్రదేశ్‌లో మహిళా పోలీసులకు ప్రభుత్వం బంపరాఫర్ ఇచ్చింది. వారు తమకు నచ్చిన శాఖను ఎంచుకోవచ్చు.. హెూం శాఖలో పనిచేయాలనుకుంటున్నారా, లేక మహిళా శిశు సంక్షేమ శాఖలో పనిచేయాలనుకుంటున్నారా అని వారే నిర్ణయించుకోవాలి.

ప్రభుత్వం మహిళా పోలీసుల ఇష్టానికే ఈ అవకాశం ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 13,500 మంది మహిళా పోలీసులు గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం వారి నుంచి అభిప్రాయాలను సేకరిస్తోంది. రెండు రోజుల్లో ఈ వివరాలు వస్తాయి.. ఆ తర్వాత పదోన్నతుల మార్గాన్ని ఖరారు చేస్తారు.

అంతేకాదు రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులకు విధులు ఎలా కేటాయించాలి అనే దానిపై కూడా ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. అందుకే మంత్రులతో కమిటీని ఏర్పాటు చేయగా.. ఆ కమిటీ ఇప్పటికే ఈ అంశంపై చర్చించింది. ముఖ్యంగా, మహిళా శిశు సంక్షేమ శాఖను ఎంచుకునే వారికి పదోన్నతులు ఎలా కల్పించాలి అనే అంశంపై అధికారులు కూడా దృష్టి పెట్టారు. ఈ మేరకు దీనిపై ప్రభుత్వానికి ఒక నివేదిక కూడా పంపారు. త్వరలోనే ఈ అంశాలపై క్లారిటీ రానుంది.

గత ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు సచివాయాల్లో ప్రత్యేకంగా మహిళా పోలీసుల్ని నియమించిన సంగతి తెలిసిందే. అయితే మహిళా పోలీసుల అంశంపై చాలాకాలం వివాదం నడిచింది. మహిళా పోలీసుల్ని హెూంశాఖ పరిధిలోకి తీసుకెళ్లి వారికి కూడా పోలీస్ యూనిఫామ్ ఇవ్వాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అంశంపై హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలైంది. అయితే 2024 ఎన్నికల తర్వాత ఏపీలో ప్రభుత్వం మారడంతో మహిళా పోలీసులకు ఎలాంటి విధులు అప్పగించాలనే అంశంపై కసరత్తు చేస్తున్నారు. మహిళా పోలీసుల్ని హెూంశాఖలో కానీ, మహిళా శిశు సంక్షేమ శాఖలో కానీ పనిచేసేలా ఆప్షన్స్ ఇచ్చింది ప్రభుత్వం. ఈ మేరకు ఏపీ సర్కార్ ఈ అంశంపై ఫోకస్ పెట్టింది. మరి ప్రభుత్వం మహిళా పోలీసులకు ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ మహిళా శిశు సంక్షేమ శాఖను ఎంపిక చేసుకున్న వారికి పదోన్నతులు ఎలా అన్నది చూడాలి.

# జిఎస్టి తగ్గింపు అన్ని రంగాల ప్రజలకు మేలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు ఏ రంగాల్లో ఎంత మేలు జరుగుతోందన్నది స్పష్టంగా అర్థమయ్యేలా తెలియచేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు మెప్మా ఆర్పీలను ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థ కౌన్సిల్‌సమావేశమందిరంలో జీఎస్టీ 2.0 పై మెప్మా ఆర్పీలతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని గణనీయంగా తగ్గించిండం ద్వారా దేశంలో పేద మధ్య తరగతి ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, దేశ ఆర్థిక వ్యవస్థ కూడా మెరుగుపడుతుందన్నారు. మెప్మా ఆర్పీలు సూపర్ జి.యస్.టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమం ద్వారా స్వయం సహాయక బృంద సభ్యులకు పూర్తి అవగాహన కలిగించాలన్నారు. ఇప్పటికే నగరంలో ప్రజలకు తెలిసేలా జీఎస్టీ తగ్గింపుపై హెూర్డింగ్స్ ఏర్పాటు చేసి, కరపత్రాలను కూడా పంచుతున్నామని తెలిపారు. అనంతరం లక్ష్మీపురం మెయిన్ రోడ్ లోని సోనోవిజన్ షోరూమ్ లో అదనపు కమిషనర్, అధికారులు జీఎస్టీ తగ్గింపుపై వినియోగదారులకు తెలియచేస్తూ కరపత్రాలు పంచి, తగ్గింపు ధరలతో కూడిన బోర్డ్ లను ఏర్పాటు చేయాలని షోరూమ్ నిర్వహకులకు తెలిపారు.

కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ అనసూయ, నగరపాలక సంస్థ డిప్యూటి కమిషనర్ బి. శ్రీనిసరావు, రెవెన్యూ అధికారి రవి కిరణ్ రెడ్డి, మెప్మా సిఎంఎంలు, సిఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

# డ్రైన్ లలో వ్యర్థాలు లేకుండా శుభ్రం చేయాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** గుంటూరు నగరంలో అంతర్గత డ్రైన్లలో వ్యర్థాలు నిల్వకుండా ప్రజారోగ్య కార్మికులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, డ్రైన్లలో వ్యర్థాలు వేసే కమర్షియల్ సంస్థలకు భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ ఆర్,అగ్రహారం, ఎత్తు రోడ్ సెంటర్, అడపావారి వీధి, ఏడుగొందుల సందు, సంగడి గుంట తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షం నీరు డ్రైన్లలో సక్రమంగా వెళ్లడానికి వ్యర్థాలు అడ్డుగా ఉంటున్నాయని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తే లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వదన్నారు. పీకలవాగు వెంబడి అవుట్ ఫాల్ డ్రైన్ల శుభ్రంపై శానిటేషన్ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజారోగ్య కార్మికులు ఉదయం ఇంటింటి చెత్త సేకరణ అనంతరం మధ్యాహ్నం సమయంలో సచివాలయాల వారిగా తప్పనిసరిగా డ్రైన్లను శుభ్రం చేయాలని ఆదేశించారు. సంగడి గుంట ప్రాంతాల్లో నూతనంగా నిర్మాణం చేసిన రోడ్లు, డ్రైన్లను పరిశీలించి, పనులు జరిగే క్రమంలో ఎమినిటి కార్యదర్శులు ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలని, పనుల్లో నాణ్యత లోపిస్తే వారితే బాధ్యత అని స్పష్టం చేశారు.

పర్యటనలో కార్పొరేటర్లు వేముల జ్యోతి పద్మజ, నిమ్మల వెంకట రమణ, డిఈఈ శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఉత్తమమైన పోలీస్ సేవలందించడమే లక్ష్యం



**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ):** జిల్లా ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడానికి కృషి చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. ఈరోజు ఆయన మంగళగిరి రూరల్, పట్టణ పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

తనిఖీ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మంగళగిరి రూరల్, పట్టణ పోలీస్ స్టేషన్లలో నేరాలు, శాంతి భద్రతా సమస్యలు, దర్యాప్తు కేసుల పురోగతిపై సమీక్ష జరిపామని తెలిపారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల కేసులు, రౌడీషీటర్ల కేసులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలకు మంచి పోలీస్ సేవలు అందించేందుకు అధికారులను స్నేహపూర్వకంగా, మర్యాదగా మెలగాలని సూచించారు. కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను చట్ట ప్రకారం త్వరితగతిన అప్పగించాలని చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సమాచారాన్ని నవమయానుకూలంగా సేకరించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్పీ మంగళగిరి రూరల్, పట్టణ పోలీస్ స్టేషన్లకు సంబంధించిన ప్రాంతీయ మ్యాప్‌లు, సీసీటీవీ కెమెరాల పనితీరును కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నార్త్ డిఎస్పీ మురళీ కృష్ణ, ఎస్బి సీఐ అలహరి శ్రీనివాస్, మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు, పట్టణ సీఐ వీరస్వామి, రూరల్ ఎస్సై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## యువత రక్తదానం పై అపోహ విడాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** రక్తదానం మహెూన్నత సేవ అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. యువత ప్రజలు అపోహలు వీడి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. బుధవారం "జాతీయ రక్తదాతల దినోత్సవం " సందర్భంగా రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ లో రోటరీ క్లబ్ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డి.ఎం.హెచ్.ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ రహదారి ప్రమాద క్షత గాత్రులకు, గర్భిణీ స్త్రీలకు, తలసేమియా వ్యాధిగ్రస్తులకు ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించే సంజీవని రక్తం మాత్రమేనని అన్నారు. ప్రజలలో అవగాహన పెంచుటకు భారతదేశ వ్యాప్తంగా "స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ " కార్యక్రమం ద్వారా దేశ ప్రజలందరూ రక్తదానం చేయటానికి ముందుకు రావాలని దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారని తెలిపారు. గత 15 రోజులుగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో అనేక కళాశాలలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి యువత రక్తదానం వైపు మరలే విధంగా రెడ్ క్రాస్ కృషి చేసిందని, రెడ్ క్రాస్ చేస్తున్న సేవలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ "నా పదహారేళ్ళ వయసులో రక్తహీనత జబ్బుతో బాధపడుతున్న ఒక బాలుడు కోసం రక్తదానం చేశానని, వైద్య వృత్తిలో ఉంటూ, సమయ భావంతో ఉన్న నేను సమయం దొరికినప్పుడల్లా రక్తదానం చేస్తూ ఉంటానని" తెలిపారు. జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో యువత ముందుకు వచ్చి రక్తదానం చేయటం అభినందనీయమని అన్నారు.

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల పర్యవేక్షకులు డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి సంవత్సరం అక్టోబర్ న జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, రక్త మార్పిడి ద్వారా ప్రాణాలు కాపాడే అంశంపై విశేష కృషిచేసిన డాక్టర్ జేజి జాలిని స్మరించుకోవాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. 18 సంవత్సరాలు వయసు 50 కేజీల బరువు ఉండి, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, దేశంలో రక్త నిల్వలు కొరత అధికంగా ఉందని దీనిని దృష్టిలో పెట్టుకొని స్వచ్ఛంద సేవా సంస్థలు, కళాశాలలు, ప్రజలు రక్తదానోద్యమానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా రక్తదాన శిబిరాలు నిర్వహించిన కళాశాలలు మాస్టర్ మైండ్స్, టీజేపీస్ కాలేజీ, మలినేని ఇంజనీరింగ్ కాలేజ్, సెయింట్ ఆన్స్ డిగ్రీ కాలేజ్ ప్రతినిధులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ పి రామచంద్ర రాజు, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అధ్యక్షులు నంబూరు కృష్ణమూర్తి, తెనాలి రెడ్ క్రాస్ చైర్మన్ ముమ్మనేని భానుమతి, డాక్టర్ శ్రవణ్ కుమార్, రోటరీ క్లబ్ సభ్యులు, రెడ్ క్రాస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్లలో పర్యవేక్షణ సక్రమంగా ఉండాలి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్)** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్నక్యాంటీన్లలో ఆహార సరఫరా సమయాలల్లో పర్యవేక్షణ కోసం విధులు కేటాయించిన వార్డ్ సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షణ చేసి, ఏమైనా లోపాలు గుర్తిస్తే నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం బస్టాండ్ సెంటర్ లోని అన్న క్యాంటీన్ ని కమిషనర్ పరిశీలించి, ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.


ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అన్న క్యాంటీన్లలో ప్రతి రోజు ప్రభుత్వ నిర్దేశిత సమయంలో ఆహారం అందుబాటులో ఉండేలా, మౌలిక వసతులు కల్పించేలా పర్యవేక్షణ కోసం వార్డ్ సచివాలయ కార్యదర్శులను కేటాయించామని, వారు నిర్దేశిత సమయంలో క్యాంటీన్లో ఉండాలన్నారు. క్యాంటీన్ పరిసరాల పరిశుభ్రంకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రధానంగా త్రాగునీరు, పారిశుధ్యం మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## ఇది అభివృద్ధి శకం



**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో అభివృద్ధి శకం ఆరంభమైందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక డీఎస్ నగర్ లో రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఈ ప్రాంతాలకు రావాలంటే కనీసం ఆటోవాలాలు కూడా భయపడే పరిస్థితి ఉండేదని, రోడ్లు అధ్వానంగా మారాయని పేర్కొన్నారు. గుంతలు కూడా పూడ్చకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. కేవలం ఏడాది కాలంలోనే అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో చాకలి గుంట అభివృద్ధి చేపట్టామని, నల్లచెరువు వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఎస్టీ కాలనీలో రోడ్లు నిర్మించామని, నిర్మల్ కాలనీలో డ్రెయిన్ విస్తరణ చేపట్టామని తెలిపారు. పీకల వాగు అవుట్ ఫాల్ కు సంబంధించిన పనులు త్వరలోనే చేపడతామని చెప్పారు. కబాడీగూడెంలో స్ట్రోమ్ డ్రెయిన్లను పునర్మిస్తామన్నారు. ప్రాంతాల వారీగా ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వేముల జ్యోతి, మాజీ కార్పొరేటర్ మాలకొండయ్య, జాగర్లమూడి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్ చల్లా ఆంజనేయ ప్రసాద్, డివిజన్ అధ్యక్షులు వహీద్, మహమ్మదా, కలాం,బాజీ, వంగర ఏడుకొండలు, ముసలయ్య, రవి, నాగేశ్వరరావు, వేముల శ్రీను, మాసూం, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పణ



**శ్రీశైలం( జర్నలిస్ట్ ఫైల్ ):** దసరా మహెూత్సవాల పండుగ సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీశైలం ఆలయంలో శ్రీ స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించబడినాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, ఆలయ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. పట్టు వస్త్రాలను అమ్మవార్ల దర్శనార్థం ప్రత్యేకంగా సమర్పిస్తూ, రాష్ట్రం ప్రజల శ్రేయస్సు, భక్తి భావాలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేయబడింది. ప్రతీ సంవత్సరం జరిగే ఈ సంప్రదాయంలో, దసరా పండుగకు ప్రత్యేకంగా దేవికి అందించే వస్త్రాలు భక్తులకు మరియు ఆలయానికి ప్రత్యేక గౌరవంగా భావించబడుతున్నాయి.

## దాముస్ టీటీ అకాడమీకి ఏపీ స్టేట్ ర్యాంకింగ్ లో పలు పతకాలు

**విజయవాడ, అక్టోబరు 01(జర్నలిస్ట్ ఫైల్) :**




సిద్దార్థ డీఎమ్డ్ యూనివర్శిటీలోని వైవీ రావు స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో సెప్టెంబర్ 29వ తేదీ జరిగిన యూటీటీ ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ లో దాముస్ టీటీ అకాడమీ క్రీడాకారులు పలు పతకాలు సాధించినట్లు అకాడమీ కోచ్ వై.దామోదర్ రెడ్డి తెలిపారు. బాలుర అండర్ 15 విభాగంలో జి.లోహిత్ స్వర్ణ పతకం, బాలికల అండర్ 11 విభాగంలో జి.మహి మన్విక స్వర్ణ పతకం, జి.మిషిక కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. వీరు పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య నగర పాలక సంస్థ ఇండోర్ స్టేడియంలో శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా విజేతలను కృష్ణాజిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈ.రామిరెడ్డి, వి.భార్గవి, కోశాధికారి ఎ.రామచంద్రరావు, వీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ డా.ఎ.శ్రీధర్, శిక్షకులు స్వపన్ గంగోపాధ్యాయ, తదితరులు అభినందనలు తెలిపారు.

## అరిజోనాలో బతుకమ్మ, దసరా వేడుకలు



**హైదరాబాద్, అక్టోబరు 01(జర్నలిస్ట్ ఫైల్) :**

ఇది తెలుగు ఆత్మకు ప్రతిబింబం, ఇది మన సంస్కృతికి సజీవ సాక్ష్యం, ఇది సంప్రదాయాలపై మనకున్న అచంచల విశ్వాసానికి ప్రతీక. ఎన్నో వేల మైళ్ల దూరంలో ఉన్నా బతుకమ్మ, దసరా పండుగను మన తెలుగు వారు ఘనంగా జరుపుకున్నారు. అరిజోనాలో నిర్వహించిన టీటీఏ మెగా బతుకమ్మ, దసరా వేడుక ఘనంగా జరిగింది. 3,500 మందికి పైగా వివిధ వర్గాల వారు ఈ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ వేడుకను విజయవంతంగా నిర్వహించినందుకు ఎంతో ఆనందంగా ఉన్నామన్నారు. దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మన సంస్కృతిని ప్రతిబింబించే, సమాజ బంధాన్ని పెంపొందించే అర్థవంతమైన కార్యక్రమాల మరిన్ని నిర్వహించనున్నామని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ జ్యోతి రెడ్డి దూదిపాల, ప్రవీణ్ సమల, స్టేట్ కోఆర్డినేటర్స్ శ్రవణ్ కుమార్ గంప, వసంత సుమంత్, రామకృష్ణ నల్ల, రీజినల్ వైస్ ప్రెసిడెంట్స్ అనూప్ గోదిశాల, అవినాష్ రెడ్డి నంద్యాల, దినేష్ రెడ్డి సుదుల, వాసవి రెడ్డి లింగాల, వినోద్ గార్లస్, కోశాధికారులు పంకజ్ కుమార్ పడాల, ప్రదీప్ చందుపట్ల తదితరులు పాల్గొన్నారు.

## విపత్తుల వేళ సేవలు అందించేందుకు ఎన్ సిసి క్యాడేట్లు సిద్ధంగా ఉండాలి



**ఉయ్యూరు, అక్టోబరు 01(జర్నలిస్ట్ ఫైల్) :**

ప్రకృతి లేక మానవ తప్పిదాల వలన సంభవించే ప్రమాదాలలో ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాల సేవలు అమోఘమని, వీరితో పాటు ఎన్సిసి క్యాడేట్లు కూడా సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలని నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ జిల్లా విభాగం ఇన్స్పెక్టర్ ఎస్. శివ కిరణ్ చెప్పారు. ఎనిమిదవ ఆంధ్ర ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్సిసి ఆధ్వర్యంలో విశ్వశాంతి పాఠశాలలో నిర్వహిస్తున్న వార్షిక శిక్షణ శిబిరంలో క్యాంపు కమాండెంట్, వింగ్ కమాండర్ అజిత్ సింగ్ రాటి, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ కన్నన్ పర్యవేక్షణలో మేనేజ్మెం ట్ డిజాస్టర్ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న శివ కిరణ్ బృందం మాట్లాడు తూ ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు సేవ చేసేందుకు ఎన్సిసి విద్యార్థులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రమాదాలు జరిగే తీరు తెన్నులు ఆయా సమయాలలో ప్రజలను రక్షించే పద్ధతులను ప్రాక్టికల్ గా విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ ఆయా సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండాల ని సూచించారు. ఇన్స్పెక్టర్ ఎస్ శివ కిరణ్ టీంను ఫ్లైట్ లెఫ్టినెంట్ జాన్సన్, జూనియర్ వారెంట్ ఆఫీసర్ కేఎ. సూరజ్, సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్సిసి అధికారులు బి.బ్రహ్మే శ్వరరావు, నీలి రామ్మోహన్, కల్పనా, పి. భాస్కరరావు, ఐ. శ్రీనివాసరావు, కె.వి శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, పి. సురేష్, జీసిఐ హారిక, పి ఐ స్టాఫ్ బిస్ట్ తదితరులు పాల్గొన్నారు.

## నభూతోన భవిష్యత్...
# దుర్గాష్టమి పాలకలశాల శోభాయాత్ర







- పోటెత్తిన భక్తకోటి.... తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నమోదు
- 4,005 మంది మహిళలచే దుర్గమ్మకు పాలాభిషేకం
- తమిళనాడు, కర్ణాటక రాష్ట్రం నుండి పెద్దఎత్తున తరలివచ్చిన అమ్మవారి భక్తులు

**వి.కోట, అక్టోబరు 01(జర్నలిస్ట్ ఫైల్) :**

చిత్తూరు జిల్లా, వి.కోట మండలంలో వెలసిన శ్రీ దుర్గా మాత ఆలయంలో దుర్గాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గాష్టమి పర్వదినాన ఆంధ్రా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రం నుండి విచ్చేసిన మహిళ భక్తులు పెద్ద ఎత్తున పాలకలశా లతో శోభాయాత్రలో పాల్గొన్నారు. శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం నుండి ప్రారంభమై పట్టణ పుర వీధుల గుండా దుర్గామాత ఆలయం వరకు 4,005 పాల కళాశాలతో భక్తిశ్రద్ధలతో మహిళలు శోభాయాత్ర నిర్వహించారు. పట్టణ పురవీధులలో జై దుర్గా మాత నినాదాలతో మారుమోగాయి. మహిళా భక్తుల కోరిక మేరకు పాలకలశాలతో వచ్చిన భక్తుల వారి చేతులమీదుగా అమ్మవారికి పాలాభిషేకం చేయడా నికి వీలు కల్పించిన ఆలయ కమిటీ. అనంతరం అర్చ కులు అమ్మవారికి అలంకరణ చేసి శాస్త్రోత్రంగా పూజ లు నిర్వహించి భక్తులకు మంగళ హారతి తో పాటు, అమ్మ వారి దర్శనం కల్పించి వారికి తీర్థప్ర సాదాలు అందజేశారు. మండల ఉభయ దారులచే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మహిళా భక్తులు మాట్లాడుతూ అమ్మలను కన్న అమ్మ, కోర్కెలు తీర్చే దుర్గమ్మ. కొంగు బంగారమైన దుర్గామాతకు మా చేతులు ద్వారా పాలాభిషేకం చేయ డం మా పూర్వ జన్మ సుకృతమని, ప్రతి సంవత్సరం వి.కోట మండలంలో వెలిసిన దుర్గామాత ఆలయంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోష దాకాయం. దుర్గామాత ఆశీస్సులు చల్లని దీవెనలు ప్రతి ఒక్కరికి ఉంటాయని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తుల కోసం పోలీసులు ప్రతిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎం ఎల్ సి కంచర్ల శ్రీకాంత్, జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపీపీ యువరాజ్, ప్రజా ప్రతినిధులు, హిందూ సంఘాల నేతలు, ఆయిమాతాజీ ఆలయ కమిటీ సభ్యులు, మూడు రాష్ట్రాల భక్తాదులు భారీగా వేలాదిగా పాల్గొన్నారు.

# వీనుల విందుగా చతుర్వేద పారాయణ సభ

**విజయవాడ, అక్టోబరు 01(జర్నలిస్ట్ ఫైల్) :**



విజయవాడ ఇంద్రకీలాద్రి ప్రత్యేక కుంకుమార్చన మంటపంలో మంగళవారం జరిగిన చతుర్వేద పారాయణ సభ వీనుల విందుగా సాగింది. బ్రహ్మశ్రీ చింతపల్లి ఆంజనేయ ఘనపాటి అధ్యక్షతన జరిగిన ఈ పండిత సన్మాన సభకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 450 మంది వేద పండితులు, వేద విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దుర్గగుడి ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ... గత 50 సంవత్సరాలుగా దసరా మహోత్సవాలలో చతుర్వేద పారాయణ సభ జరుగుతోందని చెప్పారు. వివిధ దేవస్థానాల నుంచి వేద పండితులు ఒకచోటకు రావటం వల్ల వివిధ అంశాల గురించి చర్చించే అవకాశం లభిస్తుంది అన్నారు. గత సంవత్సరం కంటే ఎక్కువమందికి పారితోషికం అందిస్తున్నట్లు తెలిపారు. ఆరు వేల రూపాయలు చొప్పున 120 మంది ఘనపాటి లకు, అయిదు వేల రూపాయల చొప్పున 302 మంది క్రమపాటిలకు, నాలుగువేల రూపాయల చొప్పున 28 మంది ఆహితజ్ఞులకు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న దుర్గగుడి చైర్మన్ గా నియమితులైన బొర్రా రాధాకృష్ణ (గాంధీ) మాట్లాడుతూ... సంస్కృతి పరిరక్షణలో వేద పండితుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం కార్య నిర్వహణ అధికారి పి. కిషోర్ కూడా పాల్గొన్నారు. 450 మంది పండితులు ఒకే గొంతుకతో చేసిన ఋగ్వేద, యజుర్వేద,సామవేద పఠన ఆకట్టుకుంది.

# లక్షలాది భక్తులకు అలుపెరగని సేవలు

**విజయవాడ, అక్టోబరు 01(జర్నలిస్ట్ ఫైల్) :**





విజయవాడ ఇంద్రకీలాద్రి దసరా నవరాత్రులలో అమ్మవారి దర్శనానికి మన రాష్ట్రం నుంచే కాక దేశంలోని సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులకు అవసరమైన సేవలందించడానికి దేవస్థానం, జిల్లా యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పలు ఏర్పాట్లు చేశాయి. చిన్నారులకు వేడి పాలు, బిస్కెట్లు అందిస్తున్నారు. రద్దీగా ఉండే క్యూలైన్లలో ప్రతి ఒక్కరికి అందేలా విశేష కృషి చేస్తున్నారు. మొదటి ఎనిమిది రోజులలో 1,75,000 బిస్కెట్ ప్యాకెట్లను, మూడు లక్షల అరవై వేల మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. 6,600 లీటర్ల పాలను 70 వేల కప్పుల ద్వారా భక్తులకు అందించారు .భక్తులకు 8 రోజులలో 35 లక్షల మంచినీటి సీసాలు పంపిణీ చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు దర్శనంలో ఇబ్బందులు కలగకుండా బ్యాటరీ కార్లు, చక్రాల కుర్చీలు ఏర్పాటు చేశారు. అధికార యంత్రాంగం తో పాటు వందలాదిమందిసేవకులు స్వచ్ఛందంగా రేయిం బవళ్లు భక్తులకు సేవలందిస్తున్నారు. జిల్లా కలెక్టర్ చైర్మన్ గా ఉండే రెడ్ క్రాస్ సంస్థ రోజుకు మూడు షిఫ్టుల్లో వృద్ధులకు, దివ్యాంగులకు సేవలందిస్తోంది. అటు పోలీసు యంత్రాంగం “సేవాదళ్” పేరిట ఒక బృందాన్ని ఏర్పాటు చేసి భక్తులకు సాయపడుతోంది. హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ భక్తులకు పాలు అందించడంలో చురుకైన పాత్ర పోషిస్తోంది. లిటిల్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థకు చెందిన “శక్తి సేవ” వాలంటీర్లు దేవాలయంలోని వివిధ విభాగాలలో సేవలందిస్తున్నారు. నగరపాలక సంస్థ కు చెందిన 1490 మంది పారిశుద్ధ్య కార్మికులు వివిధ ప్రాంతాలలో సేవలందిస్తున్నారు. దేవాలయ ప్రాంగణంలోని మరుగుదొడ్ల ను పరిశుభ్రంగా ఉంచుతూ భక్తుల మన్ననలు పొందుతున్నారు. రేయింబవళ్లు అలుపెరగకుండా అందిస్తున్న సేవలపై భక్తులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## అంబేద్కర్ రాజ్యాంగానికి
# విరుద్ధంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ

- మచిలీపట్నంలో వైఎస్సార్సీపీ ఎస్సీ సెల్ నిరసన ర్యాలీ

**మచిలీపట్నం, అక్టోబరు 01(జర్నలిస్ట్ ఫైల్) :**



ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులను ప్రైవేటు పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్సీపీ ఎస్సీ సెల్ నాయకులు డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం డా. అంబేద్కర్ రాసిన రాజ్యాం గానికి విరుద్ధం అని వారు ఆరోపించారు.గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి ఈ వివరాలను తెలియజేశారు. మచిలీపట్నం లక్ష్మీ టాకీస్ సెంటర్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

**ముఖ్య డిమాండ్లు, ఆరోపణలు**

వైద్య విద్య, వైద్యం పేదలకు దూరం చేసేందుకే కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తోందని వైఎస్సార్సీపీ నాయకులు ఆరోపించారు. రాష్ట్రంలో గతంలో వై.ఎస్. జగన్ ప్రభుత్వం నిర్మించిన 17 మెడికల్ కాలేజీలను ప్రజలకు చూపించడానికి వెళ్లిన తమ పార్టీ కార్యకర్తలపై పోలీసు లు లాఠీ ఛార్జీ చేయించారని, అక్రమ కేసులు పెట్టారని వారు వినతి పత్రం లో పేర్కొన్నారు. డా. అంబేద్కర్ రాజ్యాం గం ప్రకారం ప్రభుత్వ మే వైద్య కళా శాలలను, ఆసుపత్రులను అభివృద్ధి చే యాలని డిమాండ్ చేశారు. ప్రైవేట కర ణ వల్ల పేద ప్రజలకు వైద్యం భారమవుతుం దని, విద్యా ర్థులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ కేసులను రద్దు చేయాలని వినతి పత్రం లో కోరినట్లు ఎలిజబెత్ రాణి తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో వైఎస్సార్సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, రాష్ట్ర అధికార ప్రతినిధి మెండ కిరణ్ తో పాటు పలువురు నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# వచ్చే ఫిబ్రవరికి ముందే హెచ్-1బి వీసాల్లో మార్పులు

## అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్




**వాషింగ్టన్, అక్టోబరు 01 :** హెచ్-1బి వీసాల విషయంలో అమెరికా కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇటీవల వాటి ఫీజును 215 డాలర్ల నుంచి లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ వ్యాఖ్యలు చేశారు. 2026 ఫిబ్రవరికి ముందే ఆ వీసాల జారీ ప్రక్రియలో గణనీయమైన మార్పులు ఉంటాయని వెల్లడించారు. పాత విధానంలో లోపాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఇటీవల ట్రంప్ ప్రకటించిన వీసా ఫీజు ప్రపంచవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. హెచ్-1బి వీసాపై విధించిన లక్ష డాలర్ల రుసుము వార్షిక ఫీజు కాదని, దరఖాస్తు చేసుకొనే సమయంలో కట్టాల్సిన వన్‌టైమ్ ఫీజు మాత్రమేనని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పష్టత ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ వన్‌టైమ్ లక్ష డాలర్ల రుసుము ఇకపై కొత్తగా హెచ్-1బి వీసాకు దరఖాస్తు చేసుకునే వారికే అమలు చేస్తామని, ప్రస్తుత వీసాదారులకు, రెన్యూవల్‌కు వర్తించదని చెప్పారు. దీనిని ఉద్దేశించి వాణిజ్య మంత్రి మాట్లాడారు. '2026 నుంచి ఈ ప్రక్రియ అంతా అమలులోకి వస్తుంది. నా అంచనా ప్రకారం ఇప్పుడు.. 2026లో గణనీయమైన మార్పులు ఉంటాయి' అని పేర్కొన్నారు. లక్ష డాలర్ల ఫీజు కారణంగా రానున్న రోజుల్లో ఆ వీసాపై వచ్చే వారి సంఖ్యలో మార్పు ఉంటుందని అంచనా వేశారు. లాటరీ విధానంలో కూడా మార్పులు ఉండొచ్చనేలా వ్యాఖ్యలు చేశారు. ఒక దేశం లాటరీ ద్వారా నైపుణ్యం కలిగిన కార్మికులను తెచ్చుకోవడం ఏమిటని ప్రశ్నించారు. పాత వీసా విధానంలో లోపాలున్నాయని, ఫలితంగా అనుభవం లేని టెక్ కన్సల్టెన్సీలు దేశంలో కుటుంబాలతో సహా ప్రవేశించాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. నిపుణులైన కార్మికులు మాత్రమే దేశంలోకి వచ్చేలా అమెరికా ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. హెచ్-1బి కోసం ప్రస్తుతం ఉన్న లాటరీ విధానాన్ని మార్చాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ భావిస్తోంది. అధిక నైపుణ్యం కలిగిన విదేశీయులను మాత్రమే అనుమతించడం, అమెరికన్లకు ప్రాధాన్యం కల్పించే ఉద్దేశంతో వీటిని రూపొందించినట్లు తెలుస్తోంది. ఉద్యోగి వేతన స్థాయిని అనుసరించి రిజిస్ట్రేషన్‌లో ప్రాధాన్యం కల్పించడం, వేతన వర్గీకరణ (ఒకటి నుంచి నాలుగు) ఆధారంగా దరఖాస్తులను విభజించడం వంటి చర్యలు తీసుకోనున్నారు.

వీసాలపై అమెరికా కాంగ్రెస్‌లో మరో బిల్లు..

హెచ్-1బి, ఎల్-1 వీసాలను సంస్కరించాలని, విదేశీ ఉద్యోగుల నియామకం విషయంలో కఠిన నిబంధనలు ఉండాలని పలువురు యుఎస్ సెనెటర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు సెనెటర్లు చక్‌గ్రాస్లీ, డిక్ డర్బిన్ బిల్లును ప్రవేశపెట్టారు. కార్పొరేట్ దుర్వినియోగాన్ని అరకట్టి అమెరికా ఉద్యోగులను రక్షించడమే లక్ష్యమని ఈ సందర్భంగా వారు వెల్లడించారు.



# లడఖ్ ప్రజలను మోసగించిన ప్రధాని మోడీ

## రాహుల్ గాంధీ ఆరోపణ

**న్యూఢిల్లీ, అక్టోబరు 01 :** లడఖ్ ప్రజలతో చర్చలు జరపాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మంగళవారం డిమాండ్ చేసారు. హింసా రాజకీయాలను ఆపాలని విన్నవించారు. ఇటీవల లేహ్‌లో నలుగురు ప్రాణాలను బలిగొన్న హింసపై న్యాయపరమైన విచారణను జరిపించాలన్నారు. కాల్పుల్లో మరణించిన బాధితుల్లో ఒకరు సైనికుల కుటుంబానికి చెందినవారని రాహుల్ తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. తండ్రి సైనికుడు, కొడుకు కూడా సైనికుడే వారి రక్తం దేశభక్తితో ప్రవహిస్తుంది. అయినప్పటికీ, లద్దాఖ్‌తోపాటు అతడి హక్కుల కోసం నిలబడినందుకు బీజేపి ప్రభుత్వం దేశ ధైర్యవంతుడైన కొడుకును కాల్చి చంపింది. ఈ రోజు దేశానికి సేవ చేసినందుకు లభించే ప్రతిఫలమా?'అని రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో విమర్శించారు. "లద్దాఖ్‌లో జరిగిన హత్యలపై న్యాయ విచారణ జరగాలని దోషులకు సాధ్యమైనంత కఠినమైన శిక్ష విధించాలి అనేది మా డిమాండ్ అన్నారు. మోడీ జీ, మీరు లద్దాఖ్ ప్రజలను మోసం చేశారని రాహుల్ ఆరోపించారు. లద్దాఖ్ ప్రజలు తమ హక్కులను డిమాండ్ చేస్తున్నారని, అందుకు వారితో చర్చించాలని కోరారు. హింస, భయ రాజకీ యాలను ఆపాలని అన్నారు. అంతకుముందు సెప్టెంబర్ 24న లేహ్‌లో నిరసనల సందర్భంగా హింస చెలరేగింది. స్థానిక బీజేపీ కార్యాల యానికి నిప్పు పెట్టారు. ఈ ఘర్షణల్లో నలు గురు మరణించారు. అయితే లద్దాఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలని, ఆ ప్రాంతాన్ని ఆరో షెడ్యూలు పరిధిలో చేర్చాలని కోరడంతో పాటు పలు డిమాండ్ల సాధన కోసం సాగుతున్న ఉద్య మం ఇటీవల హింసాత్మకంగా మారాయి.

# అమెరికా ఆనాడు యుద్ధం వద్దని ఒత్తిడి తెచ్చింది..

## కేంద్ర మాజీ హోంమంత్రి చిదంబరం



**న్యూఢిల్లీ, అక్టోబరు 01 :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 26/11 ముంబై ఉగ్రదాడులపై కేంద్ర హోం శాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కీలక సమాచారాన్ని వెల్లడించారు. ముంబై దాడుల అనంతరం తాను కేంద్ర హోం మంత్రిగా బాధ్యతలు తీసుకోవడం నుంచి పాక్‌పై ప్రతిదాడికి అడ్డుపడిన పరిస్థితులను ఆయన ఒక ఇంటర్వ్యూలో వివరించారు. ముంబై ఉగ్రదాడుల అనంతరం పాకిస్థాన్‌పై సైనిక చర్యకు ఆలోచించినప్పటికీ అంతర్జాతీయ ఒత్తిడులు, ముఖ్యంగా అమెరికా నుంచి వచ్చిన ఒత్తిళ్ల కారణంగా ఆ నిర్ణయం నిలిచిపోయిందని చెప్పారు. అప్పట్లో పాకిస్థాన్‌పై దాడి చేయాలని తన మనసులో ఉందని, అయితే సైనిక చర్యకు దిగరాదని యూపీఏ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ముంబై ఉగ్రదాడుల్లో 175 మంది ప్రాణాలు కోల్పోయిన కొద్ది రోజులకే కేంద్ర హోం మంత్రిగా పి.చిదంబరం బాధ్యతలు చేపట్టారు. అప్పుడు ప్రపంచం అంతా యుద్ధం ప్రారంభించవద్దని చెప్పడానికి ఢిల్లీకి వస్తోందని, నాటి అమెరికా విదేశాంగ కార్యదర్శి కండోలిజా రైస్ ప్రత్యేకంగా తనను, ప్రధానిని కలిసేందుకు ఢిల్లీకి వచ్చారని చెప్పారు. యుద్ధంపై ముందుకు వెళ్లొద్దని తమను కోరారని వెల్లడించారు. పాకిస్థాన్‌కు బదులు చెప్పాలని తన మనసులో ఉందని, దీనిపై ప్రధానమంత్రి, ఇతర ముఖ్య వ్యక్తులతో చర్చించానని చెప్పారు. అయితే భౌతికంగా కాకుండా దౌత్యమార్గాలను ఉపయోగించాలని చివరికి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. చిదంబరం వ్యాఖ్యలపై బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా స్పందించారు. ముంబై దాడుల అనంతరం హోం మంత్రి బాధ్యతలు తీసుకునేందుకు తొలుత చిదంబరం నిరాకరించారని, పాకిస్థాన్‌పై మిలటరీ చర్యను ఆయన కోరుకున్నప్పటికీ ఆయనపై ఇతరులు విజయం సాధించారని అన్నారు. పాక్‌పై ప్రతీకార చర్యలను కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ అడ్డుకున్నారా, ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అడ్డుకున్నారా అని ఆయన ప్రశ్నించారు. యూపీఏ ప్రభుత్వంపై కండోలిజా రైస్ ప్రభావం ఉన్నట్టు కనిపిస్తోందన్నారు. 2008 నవంబర్ 8న ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబాకు చెందిన 10 మంది పాక్ ఉగ్రవాదులు ముంబైలోని పలు కీలక ప్రాంతాల్లో ఒకేసారిదాడులకు దిగారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ రైల్వే స్టేషన్, ఒబెరాయ్ ట్రిడెంట్, తాజ్ మహల్ ప్యాలెస్ అండ్ టవర్ హోటల్, కామా ఆసుపత్రి, నారిమన్ హౌస్‌లపై విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 175 మంది ప్రాణాలు కోల్పోగా, 308 మంది గాయపడ్డారు. లష్కరే ఉగ్రవాది అజ్మల్ కసబ్ ఒక్కరే ముంబై పోలీసులకు పట్టుబడగా, 2012లో అతన్ని ఉరితీశారు.




# జీవాయుధ ముప్పును సైతం ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి

## సిడిఎస్ అనిల్‌చౌహాన్ పిలుపు

**న్యూఢిల్లీ, అక్టోబరు 01 :** మానవులు సృష్టించిన జీవ ఆయుధాల వల్ల భవిష్యత్తులో సహజంగా లేదా ప్రమాదవశాత్తు ముప్పు పెరగొచ్చని భారతదేశ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్ ) జనరల్ అనిల్ చౌహాన్ హెచ్చరించారు. అణ్వాయుధాల నుంచి వెలువడే రేడియో కాలుష్యంతోనూ గండం పొంచి ఉండొచ్చన్నారు. కరోనా (కొవిడ్) మహమ్మారిని ఎదుర్కొనే క్రమంలో యావత్ ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొందని ఆయన గుర్తు చేశారు. ఫ్యూచర్‌లో జీవ ఆయుధాల ముప్పును, అణ్వాయుధాల రేడియో కాలుష్యాన్ని ఎదుర్కొనేందుకు భారత సైనిక దళాలు రక్షణపరమైన సన్నద్ధతతో ఉండాలని పిలుపునిచ్చారు. మిలిటరీ నర్సింగ్ సర్వీస్ శత వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం దిల్లీలోని మానిక్‌షా సెంటర్‌లో నిర్వహించిన శాస్త్రీయ చర్చా కార్యక్రమంలో అనిల్ చౌహాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. అణ్వాస్త్రాల్కూ వెరువని భారత్‌ను సిద్ధం చేద్దామని జీవ ఆయుధాలతో దాడి జరిగినప్పుడు, అణ్వాయుధాల నుంచి రేడియో కాలుష్యం వ్యాపించినప్పుడు ఎలా స్పందిం చాలి ఆ రెండు రకాల ముప్పులను ఎదుర్కోవాలి వాటి వల్ల ఇన్ఫెక్షన్ బారినపడే వారికి ఎలాంటి ప్రాథమిక చికిత్స, అత్యవసర చికిత్స అందించాలి అనే సమాచారంతో నిర్దిష్టమైన చికిత్సా విధానాలను మనం ఇప్పుడే సిద్ధం చేసుకోవాలన్నారు. ఆపరేషన్ సిందూర్ ముగిసిన తర్వాత భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒక విషయాన్ని క్లియర్‌గా చెప్పారు. న్యూక్లియర్ బెదిరింపులకు భారత్ భయపడదని ఆయన తేల్చి చెప్పారు.

# ఇంగ్లీషు రాయడం రాయని ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్




**సిమ్లా, అక్టోబరు 01 :** అతడొక ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపల్. కానీ థౌజెండ్ స్పెల్లింగ్ రాయరాదు. హండ్రెడ్ స్పెల్లింగ్ రాదు. సిక్స్‌కు సిక్స్‌టీన్‌కు తేడా తెలియదు. కనీసం సెవెన్ స్పెల్లింగ్ కూడా చక్కగా రాయడం రాలేదు. ఆయన రూ.7,616ను (సావెన్ థర్స్‌డే సిక్స్ హరేంద్ర సిక్స్ రూపీస్ ఓన్లీ) అని రాశాడు. ఈ చెక్కు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ఓ ప్రభుత్వ స్కూల్ ప్రిన్సిపాల్ మిడ్‌డే మీల్ వర్కర్స్‌కు ఇవ్వాల్సిన నగదుకు సంబంధించి రూ.7,616 చెక్కు ఇచ్చాడు. అయితే ఆ చెక్కులో నగదుకు సంబంధించి ఇంగ్లిష్‌లో అన్నీ తప్పులే రాశాడు. దాంతో బ్యాంకు అధికారులు స్పెల్లింగ్ మిస్టేక్స్ ఉన్నాయంటూ ఆ చెక్కును నగదుగా మార్చకుండా రిజక్ట్ చేశారు. ఆ చెక్కును సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది. నెటిజన్‌ల నుంచి రకరకాల కామెంట్స్ వస్తున్నాయి.

# బిజెపి సీనియర్‌నేత సంజయ్‌కుమార్ మల్హోత్రా కన్నుమూత



విజయ్ కుమార్ మల్హోత్రా(ఫైల్)

**న్యూఢిల్లీ, అక్టోబరు 01 :** బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ విజయ్ కుమార్ మల్హోత్రా మంగళవారం ఉదయం తన 94వ ఏట కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా వయసు సంబంధిత సమస్యలతో ఢిల్లీలోని ఎయిమ్స్ లో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం ప్రాణాలు కోల్పోయినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా ఆయన మరణవార్తను ఎక్స్ వేదికగా తెలిపారు. మల్హోత్రా జీవితం మొత్తం దేశానికి, ప్రజలకు అంకితం అయినదని అన్నారు. అది ఆయన నిరాడంబరతకు, ప్రజా సేవకు నిదర్శనమని కూడా సచ్‌దేవా తెలిపారు. జనసంఘ్ రోజుల నుంచి ఆయన ఢిల్లీలో పార్టీ సిద్ధాం తాలను విస్తరించడానికి అలుపెరుగని కృషి చేశారని కొనియాడారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు ఆయన మృతి పట్ల ప్రగాఢసానుభూతిని వ్యక్తం చేశారు. మల్హోత్రా చేసిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు.

# భారత్ జిసిసిలవైపు అమెరికా కంపెనీల ఫోకస్

## వర్క్‌ఫ్రం ఇండియా అంటున్న టెక్ దిగ్గజాలు

## ట్రంప్ హెచ్1బి వీసా ఫీజుల భారం

**బెంగళూరు, అక్టోబరు 01 :** అమెరికా అధ్యక్షుడు వీసా ఫీజులు ఒక్కసారిగా లక్ష దాలర్లకు పెంచడంతో ఇపుడు అమెరికా సంస్థలన్నీ కూడా భారత్‌కేంద్రంగా పనులను షిఫ్ట్‌చేసే ఆలోచనలో పడ్డాయి. అమెరికా టెక్ సంస్థలు ఇతరబహుళ జాతి సంస్థలన్నీ కూడా భారత్‌లో అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాలు (జిసిసి)లు భారత్ కేంద్రంగా ఉండటంతో వీసా భారం అధిగమించేందుకు క్లిష్టమైన ప్రాజెక్టులన్నింటినీ భారత్‌కు తరలించడమే మేలని భావిస్తున్నాయి. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ కలిగిన భారత్‌లో 1700కిపైగా జిసిసిలున్నాయి. అంటే ప్రపంచం మొత్తం ఉన్న సంస్థల్లో 50శాతానికిపైగా భారత్ లోనే ఉన్నాయి. లగ్జరీ కార్ డిజైన్లు, డ్యాష్ బోర్డులనుంచి ఔషధాల అన్వేషణవరకూ వీటిల్లోనే జరుగుతోంది. కృత్రిమమేధ, వీసాలపై ఆంక్షలు పెరుగుతుండటంతో అమెరికా సంస్థలు తమ కొలువుల వ్యూహాలను మారుస్తున్నాయి. భారత్‌లోని జిసిసిలతో కలిసి పనులుచేసుకోవాలని చూస్తున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలున్న జిసిసిలతో తమ పనులు చక్కబెట్టుకోవచ్చనిచూస్తున్నాయి. వీసా పెంపుభారంతో ఇపుడు అమెరికాలోని అనేక సంస్థలు తమ వర్క్‌ఫోర్స్ అవసరాలను పునఃసమీక్ష చేస్తున్నాయి. ఐదువేల డాలర్లకు మించిలేని వీసా ఫీజులు ఒకేసారి లక్షడాలర్లకు పెంచడంవల్ల నైపుణ్యం ఉన్న వర్కర్లు లభించడం కష్టంగా మారుతోంది. హెచ్‌వన్‌బి, ఎల్‌వన్ వర్క్ వీసాలకు సంబంధించి కఠిన ఆంక్షలతో కూడిన వీసా బిల్లును సె నేట్‌లో ప్రవేశపెట్టారు. ఈ బిల్లులో అనేక లొసుగులు ఉన్నాయని, అవి యాజమాన్యాలకు మేలుచేస్తున్నాయని, అమెరికన్లకు నష్టం కలుగుతోందని చెవుతున్నారు. వీటిన్నింటినీ గమనిస్తున్న అమెరికా సంస్థలు హైఎండ్ పనులు అన్నీ ఎఐతో ముడిపెడుతున్నారు. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, అనలిటిక్స్ వంటి వాటిని ఇండియా జిసిసిలకు తరలిస్తున్నారు.

# ప్రతీకారం నాపై తీర్చుకోండి..పార్టీ నేతలపై కాదు..

## ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ ఎదుర్కోలేదు..

## త్వరలోనే బాధితులను పరామర్శిస్తా: టివికె చీఫ్ విజయ్



**చెన్నై, అక్టోబరు 01 :** కరూర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనతో తన హృదయం పూర్తిగా బాధతో నిండిపోయిందని టీవీకే అధినేత, నటుడు విజయ్ అన్నారు. తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోలేదన్నారు. తన మనసు పూర్తిగా బాధతో నిండిపోయినట్లు ఆయన చెప్పారు. కరూర్ తొక్కిసలాట ఘటన జరిగిన రెండురోజుల తర్వాత టీవీకే అధినేత, నటుడు విజయ్ తొలిసారి స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఓ వీడియో విడుదల చేశారు. ఈ ఘటనలో తమ తప్పిదమేమీ లేకపోయినా డీఎంకే సర్కార్ తమపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని ఆయన విమర్శించారు. స్టాలిన్ ప్రభుత్వానికి ప్రతీకార వాంఛ ఉంటే తనను ఏమైనా చేసుకోవచ్చన్నారు. తమ పార్టీ నేతలను టార్గెట్ చేయొద్దని ప్రభుత్వాన్ని కోరారు. కరూర్ జిల్లాకు చెందిన టీవీకే నేతలపై పోలీసులు కేసులు పెట్టిన నేపథ్యంలో విజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కరూర్ ఘటన నన్ను తీవ్రంగా కలిచివేసింది. నాపై అమిత ప్రేమతో ప్రజలు ర్యాలీకి వచ్చారు. తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. త్వరలోనే కరూర్ వెళ్లి బాధితులను పరామర్శిస్తాను. వాస్తవానికి మేము ఏ తప్పు చేయకపోయినా, మాపై కేసులు పెట్టారు. నిజం త్వరలోనే బయటపడుతుందన్నారు. సీఎం స్టాలిన్ మాపై ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తున్నారా కావాలంటే నాపై ప్రతీకారం తీర్చుకోవచ్చు. నాపై కోపం, మా నాయకులపై చూపించవద్దు.ఈ ఘటనకు బాధ్యుడిగా పేర్కొంటూ టీవీకే పార్టీ కరూర్ పశ్చిమ జిల్లా మథియాళన్, కార్యకర్త పౌన్‌రాజ్, యూట్యూబర్ ఫెలిక్స్ జెరాల్డ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిపై హత్యాయత్నం, ప్రజా భద్రతకు ముప్పు కలిగించడం సహా పలు సెక్షన్ల కింద అభియోగాలు మోపారు. మరోవైపు విజయ్ ఉద్దేశపూర్వక రాజకీయ బలప్రదర్శన వల్లే ఈ ఘటన జరిగిందని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.



# అబార్షన్ చేయించుకోమన్నాడని బాయ్‌ఫ్రెండ్ పీకకోసిన యువతి

**రాయ్‌పూర్, అక్టోబరు 01 :** చత్తీస్‌ఘడ్‌లో దారుణమైన హత్య జరిగింది. గర్భం దాల్చిన ఓ మైనర్ అమ్మాయి తన బాయ్‌ఫ్రెండ్‌ను కత్తితో గొంతుకోసి చంపేసింది. ఈ ఘటన రాయ్‌పూర్ లోని ఏవన్ లాడ్జీలో జరిగింది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం బిలాస్‌పూర్‌కు చెందిన 16 ఏళ్ల నిందితురాలు ఈనెల 28వ తేదీన తన బాయ్‌ఫ్రెండ్ మొహమ్మద్ సద్దాంను కలిసేందుకు రాయ్‌పూర్ వెళ్లింది. బీహార్‌కు చెందిన ఎంఎస్ ఇంజినీరింగ్ ఆఫీసర్ అయిన బాధిత వ్యక్తితో కలిసి లాడ్జీలో గడిపింది. ప్రెగ్నెంట్ అయిన ఆ మైనర్‌పై బాధిత వ్యక్తి వత్తిడి తెచ్చాడు. అబార్షన్ చేయించుకోవాలని ఆమెపై ప్రెజర్ పెట్టాడు. దీంతో లాడ్జీ బయట ఇద్దరి మధ్య ఆ రోజు గొడవ జరిగింది. కత్తితో చంపేస్తానని బెదిరించాడతను. అయితే ఆ రోజు రాత్రి లాడ్జీ రూమ్‌లో సద్దాం నిద్రిస్తున్న సమయంలో అతడు బెదిరించిన కత్తితోనే అతని గొంతు కోసేసిందామె. ఆ తర్వాత రూమ్‌ను బయటి నుంచి లాక్ చేసి సద్దాం మొబైల్ ఫోన్‌తో పరారీ అయ్యింది. లాడ్జీ రూమ్ తాళంచెవులను సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ వద్ద పడేసింది. మరుసటి రోజు బిలాస్‌పూర్‌లో స్వంత ఇంటికి వెళ్లిన తర్వాత జరిగిన నేరం గురించి ఆ మైనర్ తన తల్లికి చెప్పింది. కోని పోలీసు స్టేషన్‌కు వెళ్లి నిందితురాలి తల్లి మర్డర్ గురించి ఫిర్యాదు చేసింది. ఏవన్ లాడ్జీకి వెళ్లిన రాయ్‌పూర్ పోలీసులు.. అక్కడ నిర్జీవంగా పడి ఉన్న సద్దాం మృతదేహాన్ని వెలికితీశారు. బీహార్‌లో ఉన్న సద్దాం ఫ్యామిలీతో కాంటాక్టు అవుతున్నట్లు పోలీసులు తెలిపారు. బాధిత వ్యక్తికి చెందిన ఫోన్ తమ వద్ద ఉన్నట్లు చెప్పారు. కేసు రిజిస్టర్ చేసి మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మైనర్ అమ్మాయి మూడు నెలల గర్భిణీ అని తెలిసింది. అబార్షన్ చేయించుకోవాలన్న ఇష్టం లేదని ఆ అమ్మాయి పేర్కొన్నది. పెళ్లి చేసుకోవాలని లేదని, గర్భస్రావం చేయించుకోవాలని సద్దాం వత్తిడి చేసినట్లు విచారణలో వెల్లడైంది. చివరకు ఆమె బాయ్‌ఫ్రెండ్ ప్రాణాలు తీసింది.

# బీహార్‌లో 7.42 కోట్ల మంది ఓటర్లు




## తుది ఓటరు జాబితా విడుదల చేసిన ఎన్నికల కమిషన్

## ముసాయిదా కంటే 18 లక్షల మంది ఓటర్లు అధికం

## అక్టోబరు 6-7 తేదీలో ఎన్నికల షెడ్యూల్?

## నవంబర్ 5-15 మధ్య మూడు దశల్లో పోలింగ్?

**న్యూఢిల్లీ, అక్టోబరు 01 :** అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడుతున్న వేళ బీహార్‌లో ఎంతో ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న తరుణంలో తుది ఓటరు జాబితా విడుదలైంది. దీంతో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ ముగిసింది. మంగళవారం విడుదలైన తుది జాబితా ప్రకారం, బీహార్‌లో 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఆగస్టు 1న విడుదల చేసిన ముసాయిదా జాబితా (7.24 కోట్లు)తో పోలిస్తే ఓటర్ల సంఖ్య 18 లక్షలు పెరిగింది. అదే జూన్ 24నాటికి ఎస్ఐఆర్ ప్రకటించిన నాటికి బీహార్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 7.89 కోట్లు. ముసాయిదా జాబితాతో పోలిస్తే వాస్తవంగా 21.53 లక్షలు అదనంగా ఉన్నారని అధికారులు తెలిపారు. కానీ 3.66 లక్షల మంది ఓటర్లు తమ పేర్లు నమోదు ఫారాలను నింపారు కానీ, గుర్తింపు పత్రాలు సమర్పించలేదు.దీంతో వారి పేర్లను తొలగించారు. దీంతో ముసాయిదా జాబితా కంటే 18 లక్షల మంది ఓటర్లు పెరిగారు.జూన్ 24కి ముందు బీహార్‌లో మొత్తం 7.89 కోట్ల మంది ఓటర్లు. ఆగస్టు 1న ఈసీ విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 7.24 కోట్ల మంది ఓటర్లున్నారు. అంటే దాదాపు 65 మంది లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించింది. ఇక అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ అక్టోబర్ 6-7 తేదీల్లో విడుదలయ్యేఅవకాశముందని ఈసీ వర్గాలు తెలిపాయి. 3-4 తేదీల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు బీహార్‌లో పర్యటించనున్నారు. ఆ తర్వాత షెడ్యూల్ విడుదల కానుంది. నవంబర్ 5 నుంచి 15 తేదీల మధ్య మూడు దశల్లో ఎన్నికల ప్రక్రియ ఉంటుందని అధికార వర్గాల సమాచారం.ప్రస్తుత బీహార్ అసెంబ్లీ కాలపరిమితి నవంబర్ 22న ముగియనుంది. అంటే, అంతకు ముందే ఎన్నికల ప్రక్రియ ముగించాల్సి ఉన్నందున అధికారుల ఆ మేరకు ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# ఇడి విచారణకు ఊర్వశి రౌతేలా




**న్యూఢిల్లీ, అక్టోబరు 01 :** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో సినీనటి ఊర్వశి రౌతేలా ఈడీ విచారణకు హాజరయ్యారు. మంగళవారం ఢిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రధాన కార్యాలయానికి వెళ్లిన ఊర్వశి రౌతేలా, విచారణ అధికారుల ముందు హాజరై, పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్ చేసే సమయంలో భారత గేమింగ్, ఆర్థిక చట్టాల గురించి తెలియదా? ప్రమోషన్ చేయడం వల్ల పారితోషకం ఎంత తీసుకున్నారు? ఏ రూపంలో ఎంతెంత అందుకున్నారు? అంటూ సినీ నటిపై ఈడీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. అధికారులు అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానమిచ్చానని, విచారణ అనంతరం ఊర్వశి రౌతేలా మీడియాతో మాటాడుతూ వెల్లడించారు. ఆర్థికపరమైన అంశాలతోపాటు ప్రమోషన్స్‌కు సంబంధించిన అంశాలపైనే ప్రశ్నించారని సినీనటి పేర్కొన్నారు.

## సంక్షిప్తంగా..

# పాకిస్థాన్‌లో భారీ పేలుడు, కాల్పులు..

**ఇస్లామాబాద్, అక్టోబరు 01 :** పాకిస్థాన్‌లోని క్వెట్టా ప్రాంతం భారీ పేలుడుతో దద్దరిల్లింది. అక్కడే కాల్పుల మోత వినిపించింది. ఫ్రాంటియర్ కోర్ కేంద్ర కార్యాలయం సమీపంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ భద్రతా సిబ్బంది లక్ష్యంగా దాడి జరిగినట్లు తెలుస్తోంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. బలోచిస్థాన్‌లోని క్వెట్టా నగరంలో పారామిలిటరీ బలగాలకు చెందిన ఫ్రాంటియర్ కోర్ కేంద్ర కార్యాలయం సమీపంలో పేలుళ్ల ఘటన జరిగింది. దాంతో దాని చుట్టువక్కల ప్రాంతాల్లోని ఇళ్లు,భవనాల కిటికీ అద్దాలు పగిలిపోయాయి. అప్పటికే ఆందోళన చెందుతున్న ప్రజలకు కాల్పుల మోత వినిపించింది. ఈ వరుస ఘటనలు స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించాయి. దాడులకు పాల్పడిన వారిని గుర్తించేందుకు బలగాలు గాలింపు చేపట్టాయి. అత్యంత తీవ్రతతో జరిగిన పేలుడుకు గల కారణాలపై దర్యాప్తు జరుగుతోంది. క్షతగాత్రులను వెంటనే దగ్గరలోని ఆస్పత్రులను తరలించారు. దాంతో ఆ చుట్టువక్కల ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితిని విధించారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు 13 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.

# కూలిన స్కూల్ భవనం:శిథిలాల కింద 65 మంది విద్యార్థులు



**జకార్తా, అక్టోబరు 01 :** ఇండోనేసియాలో నిర్మాణంలో ఉన్న ఓపాఠశాల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఓ విద్యార్థి ప్రాణాలు కోల్పోగా దాదాపు 65 మంది విద్యార్థులు శిథిలాల్లో చిక్కుకున్నారు. అంతర్జాతీయ మీడియా వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం జావాలోని సిడోర్జో పట్టణంలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల ఇస్లామిక్ పాఠశాల భవనం సోమవారం కుప్పకూలింది. మధ్యాహ్న సమయంలో భారీ సంఖ్యలో విద్యార్థులు పాఠశాల భవనంలో ప్రార్థనల కోసం గుమిగూడారు. అదే సమయంలో భవనం కూలిపోవడంతో స్థానికులు 79 మంది విద్యార్థులను రక్షించారు. ఇంకా దాదాపు 65 మంది విద్యార్థులు శిథిలాల కింద చిక్కుకున్నట్లు భావిస్తున్నారు. విద్యార్థులంతా 12 నుంచి 17 యేళ్లలోపు ఉన్నట్లు తెలిపారు. ఈ ఘటనాస్థలంల్లో విద్యార్థుల కుటుంబాల రోదనలు మిన్నంటాయి. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. శిథిలాలలో చిక్కుకొన్న విద్యార్థుల సంఖ్యను నిర్ధారించడానికి పోలీసులు పాఠశాల అధికారుల సాయం తీసుకుంటున్నట్లు సమాచారం.

# ఇజ్రాయెల్ గాజా యుద్ధం ముగింపు స్వాగతిస్తున్నాం: ప్రధాని మోడీ



**వాషింగ్టన్, అక్టోబరు 01 :** ఇజ్రాయెల్ హమాస్‌ల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు కీలక ముందడుగు పడిన విషయం తెలిసిందే. గాజాలో యుద్ధం ముగింపున కు ట్రంప్ సూచించిన 20 సూత్రాల శాంతి ఫార్ములాకు ఇజ్రాయెల్ అంగీకరించింది. ట్రంప్ ప్లాన్‌ను పలు దేశాలు స్వాగతిస్తున్నాయి. తాజాగా గాజాపై ట్రంప్ ప్రణాళికను భారత్ కూడా స్వాగతిం చింది. గాజాలో యుద్ధం ముగించేందుకు ట్రంప్ చేసిన ప్రణాళికను స్వాగతిస్తున్నట్లు ప్రధాన మంత్రి మోడీ తెలిపారు. ట్రంప్ ప్రణాళిక పశ్చిమాసియాలో దీర్ఘకాలిక శాంతికి మార్గమని పేర్కొన్నారు. యుద్ధం ముగించి శాంతిని నెల కొల్పే ఈ ప్రయత్నానికి అందరూ మద్దతు ఇస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఆ పోస్టు వైరల్ అవుతోంది. ఇజ్రాయెల్ హమాస్‌ల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే.

# మంత్రి బాలాజీని అరెస్టు చేయాలంటూ టివికె కార్యకర్త ఆత్మహత్య

**విల్లుపురం(తమిళనాడు), అక్టోబరు 01 :** తమిళనాడు రాష్ట్రంలోని కరూర్ జిల్లాలో టీవీకే ప్రచార ర్యాలీలో జరిగిన తొక్కిసలాట ఘటన రాజకీయ పరంగా తీవ్ర దుమారం రేపుతోంది. విల్లుపురం జిల్లాకు చెందిన అయ్యప్పన్ (51) టీవీకే పార్టీలో కార్యకర్తగా పనిచేస్తున్నారు. మూడు రోజుల క్రితం తన వృద్ధ తల్లిదండ్రులను చూసేందుకని మైలం గ్రామానికి వెళ్లారు. అయితే, ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన ఆయన తల్లి మునియమ్మల్ చుట్టువక్కల వారికి సమాచారం అందించడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయ్యప్పన్ గదిలో సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. అందులో పార్టీ చీఫ్ విజయ్ ప్రచారం సందర్భంగా 41 మంది ప్రాణాలు కోల్పోయిన కరూర్ తొక్కిసలాటకు డీఎంకే మంత్రి సెంథిల్ బాలాజీ, పోలీసులే కారణమని అయ్యప్పన్ సూసైడ్ నోట్‌లో రాశారు.

## జి.జి.హెచ్ లో వృద్ధులకు ప్రత్యేక వార్డును ప్రారంభించిన కలెక్టర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జి.జి.హెచ్) లో వృద్ధులకు ప్రత్యేక వార్డును జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా బుధవారం ప్రారంభించారు. ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవంలో భాగంగా ఆసుపత్రిలో 15 బెడ్ లతో వార్డును ఏర్పాటు చేశారు. దీనితో వృద్ధులకు ప్రత్యేకంగా చికిత్స అందించుటకు దోహదం కలుగుతుంది. వార్డులో సదుపాయాలు తనిఖీ చేశారు. మరుగుదొడ్లు మరింత సౌకర్యవంతంగా ఏర్పాటు చేయాలని ఆసుపత్రి పర్యవేక్షకులను ఆదేశించారు. చికిత్స పొందుతున్న పలువురు వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. డెంటల్ విభాగంలో రూ. 1.20 లక్షలతో ఏర్పాటు చేసిన రేడియో విజియో గ్రాఫి ఎక్స్ రే యూనిట్ ను ప్రారంభించారు. ఈ ప్రత్యేక పరికరం ద్వారా దంత సమస్యలను సులభంగా గుర్తించి తగిన వైద్యం అందించుటకు అవకాశం కలుగుతుంది. అనంతరం జి.జి. హెచ్ లో పిల్లలు, మహిళలు, కంగారు తదితర అన్ని విభాగాలను నిశితంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నర్సింగ్ పాఠశాల వసతి గృహాన్ని, వంటశాలను, తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు.

**జి.జి.హెచ్ మౌలిక సదుపాయాలు మెరుగుకు కృషి**

జి.జి. హెచ్ లో మౌలిక సదుపాయాలు మెరుగుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. పారిశుద్ధ్య కల్పన, మౌలిక సదుపాయాల కల్పనకు అవకాశం ఎక్కువ ఉందని అన్నారు. చికిత్స పొందుతున్న వారితో మాట్లాడడం జరిగిందని, ఆసుపత్రిలో అందుతున్న చికిత్సలు సేవలు పట్ల సంతృప్తిగా ఉన్నారని కలెక్టర్ చెప్పారు. జి.జి. హెచ్ పర్యవేక్షకులు డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ ఆసుపత్రిలో చేపట్టిన అభివృద్ధి పనులను వార్డులలో అందిస్తున్న సేవలను వివరించారు.

## వ్యాపారులకు మంత్రి లోకేష్ చేయూత




**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంత్రి నారా లోకేష్ సహకారంతో మంగళగిరి మండలం, నవులూరు గ్రామానికి చెందిన గంజిల పాండు రంగా రెడ్డి, దాకూరి ఈశ్వరమ్మలకు తోపుడు బండ్లు అందజేశారు. త?మ కుటుంబ జీవనోపాధికి అవసరమైన , తోపుడు బళ్లు అందజేయాలని మంత్రి నారా లోకేష్ని కోరగా వెంటనే బళ్లు తయారు చేయించి నాయకుల చేతుల మీదుగా అందజేయించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గం భారత దేశంలో నెంబర్ వన్ నియోజవర్గముగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో నారా లోకేష్ పనిచేస్తున్నారని కొనియాడారు,నియోజకవర్గం లో చిరువ్యాపారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటున్నారని పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి మంత్రి నారా లోకేష్ గత ఆరేళ్లుగా ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. సొంత నిధులతో ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. తమకాళ్ల మీద తాము నిలబడుతూ ఉపాధి పొందుతున్న బడుగుజీవులకు తోడ్పాటు అందించాలని సొంత నిధులతో వివిధ రకాల విలువైన బండ్లను చేయించి అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, గ్రామ పార్టీ అధ్యక్షులు రుద్రు కోటేశ్వరరావు, గుంటూరు పార్లమెంట్ యస్సీ సెల్ అధ్యక్షులు వేమూరి మైనర్ బాబు,రుద్రు నాగరాజు,రుద్రు శ్రీనివాసరావు కొత్త శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రీ దేవి అలంకారంలో వాసవి అమ్మవారు



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారి మఠం మండలంలోని స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం నందు నేడు గాయత్రీ దేవి అలంకారంలో వాసవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా అమ్మవారి శాలయందు ఉభయ దాతలచే చండీ హెూమం నిర్వహించారు ఈ కార్యక్రమం నందు అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు కార్యదర్శి సుంకు సురేష్ మాజీ అధ్యక్షులు బన్నూరు కృష్ణమూర్తి మాజీ కమిటీ సభ్యులు ముచ్చర్ల శేషయ్య పబ్బతి నాగేశ్వరరావు బింగి సుధాకర్ యువజన సంఘం అధ్యక్షుడు యాదాల వెంకటసుబ్బయ్య కమిటీ మెంబెర్స్ దుగ్గిశెట్టి గురవయ్య మాకం సుధాకర్ నిర్వహించడం జరిగింది

## హార్వెస్ట్ ఇండియ సేవా... సహాయం అభినందనీయం

○ **ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్**




**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి అనుసంధానం చేస్తూ హార్వెస్ట్ ఇండియా అంబులెన్స్ను అందజేయడం అభినందనీయమని, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ హార్వెస్ట్ ఇండియా ప్రతినిధులను ప్రశంసించారు. హార్వెస్ట్ ఇండియా నిర్వాహకులు కత్తెర సురేష్ కుమార్, సతీమణి జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హేనీ క్రిష్టీనాల వితరణతో, తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు బుధవారం అంబులెన్స్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని , అంబులెన్స్ ను జెండా చూపించి ప్రారంభించారు. హాస్పిటల్ సూపర్నెంట్ డాక్టర్ సౌభాగ్యవాణికి అంబులెన్స్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు గతంలో ఎవరూ చేయని విధంగా, హాస్పిటల్ మార్చురీని అనుసంధానం చేస్తూ అంబులెన్స్ ను అందజేయడం అభినందనీయమనిఅన్నారు. హాస్పటల్ కి వచ్చేవారు పేద వర్గాల వారని, అనుకోని మరణం సంభవించినప్పుడు, ఆ పార్థీవ దేహాన్ని, అంబులెన్స్ ద్వారా ఎటువంటి ఖర్చు లేకుండా, వారి ఇంటి వద్దకు తీసుకువెళ్ళే సేవకు, హార్వెస్ట్ ఇండియా తోడ్పాటు లభించిందని అన్నారు. అంబులెన్స్ మెయింటినెన్స్ ఖర్చులు కూడా హార్వెస్ట్ ఇండియా వారే భరిస్తారని, హాస్పటల్ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు, అంబులెన్స్ సేవలు కొనసాగుతాయని అన్నారు. హాస్పటల్ సూపర్నెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ హాస్పటల్లో డెడ్ బాడీ లు తీసుకువెళ్లే వెహికల్ లేదని, హార్వెస్ట్ ఇండియా ద్వారా లభించిన సహాయానికి ధన్యవాదాలు తెలిపారు. హార్వెస్ట్ ఇండియా అధినేత కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ వైశ్యాలకు వచ్చే పేద వర్గాలు అనుకోని విధంగా మరణించినప్పుడు, ఆ భౌతిక కాయాన్ని తీసుకు వెళ్లడానికి స్తోమత లేని వారికి, అంబులెన్స్ సేవలు ఉపయోగపడాలన్న భావన వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో కూడా ప్రభుత్వ వైద్యశాలలో అంబులెన్స్ ఇవ్వాలన్న సంకల్పం ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు, నర్సింగ్ సిబ్బంది,వైద్యాధికారులు, తెలుగుదేశం పార్టీలోని వివిధ స్థాయి నాయకులు, హార్వెస్ట్ ఇండియా సభ్యులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు దసరా కానుక

○ **నిత్యావసరాల కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నసీర్**

○ **టీడీపీ నేత వేల్చూరి కిరణ్ సహకారంతో ఏర్పాటు**

○ **పండుగ సంతోషంగా గడుపుకోవాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజారోగ్య పరిరక్షణలో ప్రతి నిత్యం సేవలు అందించే మున్సిపల్ కార్మికులకు సాయమందించడం సంతోషకరమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. టీడీపీ నేత వేల్చూరి కిరణ్ సహకారంతో బుధవారం నగరంలోని మున్సిపల్ కార్మికులు దసరా కానుకగా నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే నసీర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో మున్సిపల్ కార్మికుల పాత్ర కీలకమని తెలిపారు. దసరా పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుకోవాలని సూచించారు. సీఎం చంద్రబాబు నాయుడు రూపొందించిన పీ4 వంటి కార్యక్రమాలతో అనేక మంది స్ఫూర్తి పొందుతున్నారని తెలిపారు. తమకు ఉన్నంతలో పేద వారికి సాయం చేయాలనే సంకల్పంతో ముందుకు వస్తున్నారని, ఇది మంచి పరిణామమని పేర్కొన్నారు. సమాజంలో ఆర్థిక అంతరాలు తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతోందని అన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గం గంజం రాఘవేంద్ర, జాగర్లమూడి శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ సజీలా, కార్పొరేటర్ రిహానా, క్లస్టర్ ఇంచార్జ్ వేల్చూరి కిరణ్,చెట్టు కనకారావు, డివిజన్ అధ్యక్షులు కన్నా, జనసేన నాయకులు చామర్తి ఆనంద్ సాగర్, చాట్ల విజయబాబు, గణేష్ నాగేశ్వరరావు, వల్లూరి సాయి చైతన్య, ఖాసింబాబు, ఉప్పుతల రాజు, కొల్లా శ్రీనివాసరావు, పుట్టా దుర్గా, ఆరాధ్యుల రమణా తదితరులు పాల్గొన్నారు.

## కూటమి కుట్రలు బద్ధలు కొడదాం

○ **క్రైస్తవులకు వైసీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ పిలుపు**




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** దేశంలోనే క్రైస్తవులను అన్ని రంగాలలో బలోపేతం చేయాలని సంకల్పించిన ఏకైక నాయకుడు వైయస్ జగన్ అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ కొనియాడారు. ఆ సంకల్పం ఆయన సీఎంగా ఉంటేనే సిద్ధిస్తుందన్న వాస్తవాన్ని గుర్తెరిగి తిరిగి జగన్ను ముఖ్యమంత్రి చేసే దిశలో క్రైస్తవులంతా ఏక తాటిపైకి రావాలని ఆయన కోరారు. క్రైస్తవులు సంఘటితమై కూటమి కుట్రలు బద్దలు కొట్టాలని జాన్ వెస్లీ పిలుపునిచ్చారు.
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వాసిమళ్ళ విజయ్ ఆధ్యక్షతన బుధవారం బృందావన్ గార్డెన్స్లోని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి క్యాంపు కార్యాలయంలో క్రిస్టియన్ సెల్ జిల్లా ముఖ్య నేతల సమావేశం జరిగింది.
సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జాన్ వెస్లీ మాట్లాడుతూ, రాష్ట్రంలో క్రైస్తవ వ్యతిరేక కూటమి ప్రభుత్వం రాజ్యమేలుతోందని పేర్కొన్నారు. క్రైస్తవులు అభివృద్ధి చెందడాన్ని కూటమి ప్రభుత్వం తట్టుకోలేదని తెలిపారు. అందుకే అన్ని రంగాలలో క్రైస్తవులను అణిచివేతకు గురి చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అణిచివేతలు – అవమానాలు తొలగి ఆత్మాభిమానం – ఆత్మగౌరవంతో బతకాలంటే.. వైయస్ జగన్ మళ్ళీ ముఖ్యమంత్రి కావాల్సిందేనని ఆయన తేల్చి చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని స్థాయిల్లో పటిష్టమైన కమిటీలు ఏర్పాటు చేసి, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆయన కోరారు.
క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ పోలె ముత్యం మాట్లాడుతూ, నవరత్నాలతో నిరుపేద క్రైస్తవ కుటుంబాలలో ప్రగతి కాంతులు పూయించిన ఘనత వైయస్ జగన్కు మాత్రమే దక్కుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర కార్యదర్శి మద్దు ప్రేమ్ జ్యోతిబాబు మాట్లాడుతూ, క్రైస్తవులంతా వైయస్ జగన్ను తిరిగి ముఖ్యమంత్రిని చేసే ప్రార్థనా యోధులుగా మారాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు వాసిమళ్ళ విజయ్ మాట్లాడుతూ, ఒక్క క్రైస్తవులకే కాక అణగారిన వర్గాలతో పాటు అగ్ర వర్ణాలకు చెందిన పేదలకు సైతం పెన్నిధిగా నిలిచిన సంక్షేమ చక్రవర్తి వైయస్ జగన్ అని కొనియాడారు. కార్పొరేటర్ పాపతోటి అంబేద్కర్ మాట్లాడుతూ, సమసమాజ నిర్మాణం, క్రైస్తవుల అభ్యున్నతి వైయస్ జగన్తోనే సాధ్యమని పేర్కొన్నారు. కార్పొరేటర్ బూసి రాజలత మాట్లాడుతూ, క్రైస్తవుల బతుకులు బాగుపడాలన్నా.. క్రైస్తవ బిడ్డల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నా.. వైయస్ జగన్ మళ్ళీ ముఖ్యమంత్రి కావడం ఒక్కటే ఏకైక మార్గమని వివరించారు. సమావేశంలో న్యాయవాది డేవిడ్, బత్తుల దేవానంద్, మాదాసు భాగ్యారావు, జోయల్, ఆలా కిరణ్, జిల్లాలోని పలు నియోజకవర్గాల క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు దెబోరా, విక్టర్, దాసరి రాజా, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

## నేడు గుంటూరు నగరంలో మాంసం, చేపల విక్రయాలు నిషేధం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఈ నెల 2వ తేదీ (గురువారం) గాంధీ జయంతి సందర్భంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మాంసం, చేపల విక్రయాలు పూర్తిగా నిషేధిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గాంధీ జయంతి రోజున మాంస విక్రయాలు నిషేధం అమలులో ఉంటాయి. ఈ నిషేధం నగరంలోని మాంస, చేపల విక్రయదారులపైనే కాకుండా హెూటల్స్, రెస్టారెంట్లపై కూడా వర్తింపజేయబడుతుంది.
నిషేధం ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. అలాగే, ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు వార్డ్ వారీగా నిషేధం అమలు ఎలా జరుగుతుందో పర్యవేక్షించాల్సిందిగా ఆదేశించారు.

## సీఎం సహాయక నిధి చెక్కుల పంపిణీ




**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్):** మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని 22 బాధిత కుటుంబాలకు మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ సీఎం రిలీఫ్ ఫండ్ కింద 29,45000/- చెక్కులను ప్రొద్దుటూరు క్యాంప్ ఆఫీస్ నందు బాధితులకు అందజేయడం జరిగింది. సుధాకర్ యాదవ్ కు బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## జి.ఎస్.టి తగ్గింపుతో కుటుంబాలకు ఊరట




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** జి.ఎస్.టి తగ్గింపుతో కుటుంబాలకు ఊరట లభిస్తుందని గుంటూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ షేక్ సజీల అన్నారు. రాష్ట్ర జి.ఎస్.టి అధికారులతో కలసి పట్టణంలోని మాయా బజారులో పలు దుకాణాలను బుధవారం సందర్శించారు. దుకాణదారులతో ముఖాముఖి మాట్లాడి జి.ఎస్.టి తగ్గింపుపై వారిలో ఉన్న అవగాహనను తెలుసుకున్నారు. పుస్తకాలు, ఇతర సామగ్రిపై ఎంత మేర జి.ఎస్.టి గతంలో ఉన్నది, ప్రస్తుతం ఎంత మేర తగ్గింపులో ఉన్నది తెలుసుకున్నారు. జి.ఎస్.టి తగ్గింపు వలన ధరల తగ్గుదల వివరాల బోర్డులను ప్రదర్శించాలని సూచించారు. జి.ఎస్.టి తగ్గింపుతో సామాన్య కుటుంబాలకు అత్యంత ప్రయోజనం కలుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 4 స్లాబ్ లుగా ఉన్న జి.ఎస్.టిని రెండు స్లాబ్ లుగా తగ్గించిందని చెప్పారు. జి.ఎస్.టి తగ్గింపు వలన రాష్ట్ర ప్రభుత్వానికి ఎనిమిది వేల కోట్ల రూపాయలు ప్రతి ఏటా నష్టం వాటిల్లుతున్నప్పటికీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం దీన్ని బలపరుస్తుందన్నారు. పుస్తకాలు, స్టేషనరీ, ఇన్సూరెన్స్, వ్యవసాయ పరికరాలు, ఆరోగ్య సంబంధిత సామాగ్రి, తదితర అనేక అశాలపై అతి తక్కువ జి.ఎస్.టి ఉందన్నారు. వాహనాలు ఎలక్ట్రానిక్ గూడ్స్ పైన ధరలు తగ్గడం జరిగిందని చెప్పారు. ప్రతి కుటుంబానికి నెలకు 2 వేల నుండి 10 వేల రూపాయల వరకు ఆదా అవుతుందన్నారు. జి.ఎస్.టి జాయింట్ కమిషనర్ గీతా మాధురి మాట్లాడుతూ దసరా నుండి దీపావళి వరకూ ప్రత్యేక ప్రచార అవగాహన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో వివిధ అవగాహనా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందని అన్నారు. సామాన్య ప్రజలకు గృహ, నిత్యావసర వస్తువులు, ఆహారం, మందులు, విద్యా, స్టేషనరీ, బట్టలు, క్రీడా వస్తువులు, మహిళలు, పిల్లలు, రవాణా అంశాలకు సంబంధించి జిఎస్టి తగ్గింపు వల్ల ప్రయోజనం కలుగుతుందన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, ఉపాధిహామీ కూలీలు, మత్స్యకారులు, ఆక్వా రైతులు, ట్రేడింగ్ ఎంఎస్ఎంఇలు, నేత, హస్త కళాకారులు, పేపరు – ప్యాకేజింగ్, సెలూన్లు, స్పా, యోగా కేంద్రాలు, జిమ్, టైక్స్ టైల్స్ రంగాల్లో పనిచేసే వారికి, మానవ వనరుల అభివృద్ధి, డిజిటల్ సాంకేతికకు సంబంధించిన విద్య, జీవితబీమా, ఆరోగ్య బీమా, ఎలక్ట్రానిక్స్, ఎంట్రప్రెన్యూర్ షిప్పు, ఇ–కామర్స్ అండ్ గిగ్ ఎకానమీ, కనస్ట్రక్షన్ మెటీరియల్, టూరిజం – హాస్పిటాలిటీ, టాన్సుపోర్టు, లాజిస్టిక్స్, బొమ్మలు, స్పోర్ట్సు గూడ్స్, రెన్యువల్ ఎనర్జీ, ఆటోమొబైల్, మాన్యూఫ్యాక్చరింగ్ రంగాల్లో జి.ఎస్.టి తగ్గుదల ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జి.ఎస్.టి డిప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాస్, సహాయ కమిషనర్లు జి.వెంకటేశ్వర్లు, ఆర్.అనసూయ, కె శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## జయజయహే... మహిషాసుర మర్ధనీ...



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** జయ జయహే మహిషాసుర మర్ధిని , రమ్యకపర్ధిని శైలసుతే అంటూ భక్తులు అమ్మవారిని వేనోళ్ల కీర్తిస్తూ... మహిషాసుర మర్ధిని అలంకారంలో ఉన్న జగజ్జననిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ శైవాలయాలలో, శక్తి పీఠాలలో అమ్మవారు మహిషాసుర మర్ధిని అలంకారంలో ప్రత్యేక పూజలు అందుకున్నారు. రామలింగేశ్వరపేట శ్రీ దుర్గా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్ధనిగా పూజలు అందుకున్నారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆలయ ప్రాంగణంలో బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. దేవి గుడి సెంటర్లో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు మహిషాసుర మర్ధినిగా పూజలు అందుకున్నారు. మారీస్ పేటలోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ చంద్రమౌళేశ్వర స్వామి వారి ఆలయంలో, అసుర సంహారం చేసిన మహిషాసుర మర్ధినిగా, అమ్మవారు దర్శనం ఇచ్చారు. ఆలయ పాలకమండలి ఉత్సవాలను పర్యవేక్షించారు బోస్ రోడ్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శ్రీ వాసవి మాత మహిషాసుర మర్ధినిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు మహాకాళిగా పూజలు అందుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు నుదురుపాటి రామకోటేశ్వర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వన దుర్గ దేవి సన్నిధానంలో మహిళా భక్తులు విశేష పూజలు నిర్వహించగా, శ్రీ చండీయాగ హెూమ క్రతువు ప్రాధాన్యతను సంతరించుకుంది. బుర్రిపాలెం రోడ్ లోని కాళీమాత ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్ధినిగా భక్తులకు దర్శనమిచ్చారు. అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారి సన్నిధానంలో అర్చక స్వాముల ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుకూడళ్ళలోని అమ్మవారి ఆలయాల్లో, శక్తి పీఠాల్లో అమ్మవారికి మహిషాసుర మర్ధిని అలంకారంలో ఘనంగా పూజలు అందుకున్నారు.

## యువత భవితకు చేయూతనిచ్చిన ఘనత జగన్ సొంతం : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో యువత భవితకు చేయూత అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ సొంతమని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి స్పష్టం చేశారు. తాను ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నాలుగు నెలల కాలంలోనే నాలుగు లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడమే అందుకు నిదర్శనమని ఆయన వివరించారు. తద్వారా దేశ చరిత్రలోనే సరికొత్త రికార్డు సృష్టించడమే కాక రాష్ట్రంలో నిరుద్యోగ రక్కసిని తరిమికొట్టేందుకు చిత్తశుద్ధితో కృషి చేసిన వాస్తవం అందరికీ తెలిసిందేనని ఆయన వ్యాఖ్యానించారు.
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షుడుగా నియమితులైన కానూరు శశి బుధవారం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లేళ్ళ అప్పిరెడ్డి శశికి శాలువా కప్పి అభినందించారు. పశ్చిమ నియోజకవర్గంలో యువజన విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని భుజం తట్టి ప్రోత్సహించారు.
అనంతరం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, 2019 ఆగస్టు 15వ తేదీన వాలంటీర్ వ్యవస్థ ద్వారా అక్షరాలా 2,66,796 కొత్త ఉద్యోగాలను సృష్టించిన యువజన పక్షపాతి జగన్ అని కొనియాడారు. సరిగ్గా ఆరేళ్ళ క్రితం ఇదే రోజున (2019 అక్టోబర్ 2 గాంధీ జయంతి నాడు) సచివాలయాల వ్యవస్థకు శ్రీకారం చుట్టడం ద్వారా 1,28,858 మంది నిరుద్యోగ యువతకు నాటి వైయస్ జగన్ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చిందని గుర్తు చేశారు.
ఇక 20 లక్షల ఉద్యోగాలు ఇస్తా.. ఉద్యోగం ఇవ్వలేకపోతే నెలనెలా నిరుద్యోగ భృతి ఇస్తా.. అని నమ్మకంగా చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా జగనన్న ఇచ్చిన ఉద్యోగాలను కూడా ఊడబీకేశారని లేళ్ళ అప్పిరెడ్డి ఆరోపించారు. తాను సీఎం అయిన వెంటనే జీతం పెంచుతానని ఆశపెట్టి, ముఖ్యమంత్రి కాగానే వాలంటీర్లను పీకి పారేశారని విమర్శించారు. ఇంకా ఇంటింటికీ తిరిగి రేషన్ ఇచ్చే వారిని, ఫైబర్ నెట్, స్కిల్ డెవలప్మెంట్ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులను కూడా ఊడబీకి వేలాది మంది యువతను బలవంతంగా నిరుద్యోగ ఊబిలోకి నెట్టారని నిందించారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు నిజస్వరూపం గురించి యువతీ యువకులందరికీ తెలియజెప్పి, వారిలో చైతన్యం తెచ్చేందుకు కృషి చేయాల్సిన బాధ్యత వైసీపీ యువజన విభాగం నేతలపైనే ఉందని ఆయన తెలిపారు. చంద్రబాబు చేసిన మోసం, జగన్ హయాంలో చేకూరిన ప్రయోజనంపై అందరిలో అవగాహన పెంపొందించాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పిలుపునిచ్చారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వానికి ప్రథమ కర్తవ్యం

○ విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన వ్యవసాయ శాఖ మంత్రి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** విజయదశమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ విజయదశమి అనేది సత్యం, ధర్మం, న్యాయం చెడుపై సాధించే విజయానికి ప్రతీక. ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, సుభిక్షం నింపాలని మనసారా కోరుకుంటున్నాను. రైతులు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు సంక్షేమానికి ప్రధాన ప్రాధాన్యం ఇస్తూ, పంటలకు మద్దతు ధరలు కల్పించడం, రాయితీలు ఇవ్వడం, సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, విద్యుత్‌ను సమృద్ధిగా అందించడం ద్వారా రైతుల ముఖాల్లో చిరునవ్వులు తెప్పించగలిగాం. రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వానికి ప్రథమ కర్తవ్యం. గడచిన కొద్ది నెలల్లోనే రైతు బంధువులందరికీ స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఈ విజయదశమి సందర్భంలో రైతాంగం మరింత బలపడాలని, వారి శ్రమతో ఆంధ్రప్రదేశ్ సుసంపన్నంగా మారాలని ఆకాంక్షిస్తున్నాను అని తెలిపారు.

# పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లను జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళగిరి పట్టణంలో టిడ్కో కాలనీలో బుధవారం జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. వివిధ విభాగాల పింఛనుదారులకు పంపిణీ చేశారు. వారితో ముఖాముఖి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లను అందిస్తుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లాలో మొత్తం 2,56,904 మంది పింఛనుదారులకు రూ. 111.34 కోట్లు పంపిణీ జరుగుతుందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులు, మెప్మా, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, గ్రామ వార్డు సచివాలయ అధికారులు, సిబ్బంది ఇందులో నిమగ్నం అయ్యారని తెలిపారు. మొత్తం పింఛన్లలో వృద్ధాప్యపు పింఛన్లు 1,18,174., వితంతువులు 70,112., చేనేతకారులు 3,862., గీతకార్మికులు 443., మత్స్యకారులు 570., ఒంటరి మహిళలు 11,330., చర్మకారులు 876., హిజ్రాలు 67., హెచ్.ఐ.వి బాధితులు 2,614., కళాకారులు 77., డప్పు కళాకారులు 854., దివ్యాంగులు 24,835., వైద్య సంబంధిత పింఛనుదారులు 1667., సైనిక సంక్షేమం 28., అభయహస్తం 3,994., అమరావతి భూముల సంబంధిత 17,401 పింఛన్లు పంపిణీ జరుగుతుందన్నారు. బుధవారం ఉదయం నుండి పంపిణీ జరుగుతుందని, బుధవారం తీసుకోలేని వారికి శుక్రవారం పంపిణీ జరుగుతుందని ఆమె చెప్పారు. ముఖాముఖిలో భాగంగా స్థానికంగా మౌలికసదుపాయాలు కొరత ఉందని, మురుగు నీరు రహదారులపై నిలువ ఉంటుందని, కుక్కలు బెడద ఉందని స్థానికులు తెలియజేయగా సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. సూపర్ జిఎస్టి – సూపర్ సేవింగ్స్ పై ప్రజల్లో అవగాహన, అధికారులు నిర్వహిస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం ప్రభావం వలన వ్యాధులు వ్యాపించే అవకాశం

# దసరాకి ఉద్యోగులకు నిరాశ - ప్రభుత్వం మొండి చెయ్యి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు నిరాశ ఎదురైందని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్ బాష పేర్కొన్నారు. గుంటూరులో జిల్లా కార్యాలయంలో పత్రిక ప్రకటన విడుదల చేసిన ఆయన, ఇప్పటివరకు ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శించిందని తీవ్రంగా విమర్శించారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు అయినప్పటికీ నాలుగు డీఏలు పెండింగులోనే ఉన్నాయని, కనీసం ఒక డీఏ కూడా విడుదల కాలేదన్నారు. విజయదశమి పర్వదినానైనా బకాయిల చెల్లింపుల గురించి స్పష్టత ఇవ్వడంలో విఫలమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదివరకే 11వ వేతన సంఘం గడువు ముగిసి రెండేళ్లు గడిచినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అంతేకాక ఇప్పటివరకు ఐఆర్ (ఇంటరిమ్ రిలీఫ్) కూడా ప్రకటించలేదని ఆయన అన్నారు.

చివరికి ప్రభుత్వ ఉద్యోగులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 12వ పీఆర్‌సీ కమిషన్ కూడా ఇప్పటి వరకు ఏర్పాటు కాలేదని చాంద్ బాష విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీపీఎస్, జీపీఎస్ అంశాలపై ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చి ఇప్పటికీ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఉద్యోగుల సంక్షేమం విస్మరిస్తూ, ఇవ్వాల్సిన హక్కులు కూడా ఇవ్వకుండా దశరా కాలంలో ఖాళీహస్తాలతో వదిలేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ బాధ్యతలు గుర్తించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జిల్లా అధ్యక్షులు చాంద్ బాష డిమాండ్ చేశారు.

# స్వావలంబన దిశగా భారత్ : పివిఎన్ మాధవ్



అమరావతి బ్యూరో : ప్రధాని మోడీ నేతృత్వంలో దేశం స్వావలంబన దిశగా అడుగులు వేస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. విజయవాడ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ఆత్మనిర్భర్ భారత్ అమలు చేస్తుందన్నారు. దేశం అన్ని విధాలా ఎదగాలనే ఉద్దేశంతో మోడీ స్వదేశీ నినాదాన్ని తీసుకున్నారన్నారు. గురువారం నాడు విజయవాడలో జరిగే చేనేత సంతలో సిఎం చంద్రబాబు పాల్గొంటారని తెలిపారు.

# వరద ముంపు కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు

○ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్.



తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)ప్రకాశం బ్యారేజీ నుండి ఉధృతంగా సముద్రం లోకి వస్తున్న వరద నీటి వల్ల కృష్ణా నది పరివాహక ప్రాంత గ్రామాలలో ప్రజలకు ఎటువంటి ప్రాణ నష్టం,ఆస్తి నష్టం,పశు నష్టం జరగకుండా ప్రజా ప్రతినిధులు, అధికారులు, మంత్రులు సమన్వయంతో ముందుకు వెళు తున్నారని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

కొల్లిపర మండలం తూములూరు గ్రామ శివారులో వరదనీటి కారణంగా ముంపు బారిన పడిన పంట పొలాలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పార్టీ నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. పసుపు కంద మినుము అరటి నిమ్మ వంటి వాణిజ్య పంటలను పరిశీలించారు. ప్రధానంగా మినుము పంట నీట మునిగిన విధానాన్ని గమనించారు. అనంతరం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ వరదనీటి వల్ల గతంలో జరిగిన నష్టాలను దృష్టిలో ఉంచుకుని, ఆ పరిస్థితిని అధిగమించేందుకు , అన్ని విభాగాల అధికారులు, మంత్రులు ప్రజాప్రతినిధులు, సమిష్టి భాగ స్వామ్యంతో గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉన్నారని అన్నారు. గ్రామస్థాయిలో ఎవరికీ ఎటువంటి నష్టం జరగకూడదని, ఆ దిశగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాణిజ్య పంటల విషయాన్ని ప్రస్తావిస్తూ మినుము కొన్నిచోట్ల నీటి మునిగిందని, క్షేత్రస్థాయిలో జరిగే పంట నష్టాన్ని, హార్టికల్చర్, అగ్రికల్చర్ విభాగాల ప్రతినిధులు సమస్యను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు వివరించాలని అన్నారు. ఇంతటితో వరద నీరు తగ్గితే పెద్ద సమస్య ఉండదని, మరి కొన్ని రోజులు కొనసాగితే పంట నష్టం తీవ్రత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీక్రిస్టీన, రాష్ట్ర పార్టీ నాయకులు కత్తెర సురేష్ కుమార్, కొల్లిపర మండల పార్టీ నాయకులు, మండల స్థాయి వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం: మంత్రి సవిత



**పెనుకొండ/శ్రీసత్యసాయి(జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వం ఏటా డీఎస్సీ నిర్వహించాలని నిర్ణయించిందని, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తాము కూడా ఏటా ఉచిత డీఎస్సీ శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. డీఎస్సీ అంటేనే టీడీపీ అని, టీడీపీ అంటేనే డీఎస్సీ అని వెల్లడించారు. ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామంటూ జగన్ నిరుద్యోగయువతను అయిదేళ్లపాటు దగా చేశారని మండిపడ్డారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఇటీవల మెగా డీఎస్సీలో పెనుకొండ నియోజకవర్గం నుంచి టీచర్ పోస్టులు సాధించిన 70 మంది అభ్యర్థులకు మంత్రి సవిత బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, 2025 మెగా డీఎస్సీలో టీచర్ పోస్టులు సాధించిన 15,941 మంది అభ్యర్థులకు ఇటీవల సీఎం చంద్రబాబు నియామక పత్రాలు అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టినప్పుడు తన తొలి సంతకం మెగా డీఎస్సీ నిర్వహణ ఫైల్ పై పెట్టిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. కేవలం 150 రోజుల్లో డీఎస్సీ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసిన ఘనత మంత్రి నారా లోకేష్‌దేనన్నారు. మెగా డీఎస్సీని అడ్డుకోడానికి వైసీపీ నాయకులు 105కు పైగా కోర్టుల్లో కేసులు వేశారన్నారు. వాటన్నింటినీ అధిగమించి డీఎస్సీ నిర్వహించిన ఘనత లోకేశ్‌దేన్నారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వంలో 15 ఏళ్లలో 14 సార్లు డీఎస్సీని నిర్వహించి, 1,96,619 టీచర్ ఉద్యోగాలిచ్చారన్నారు. అందుకే డీఎస్సీ అంటేనే టీడీపీ.. టీడీపీ అంటేనే డీఎస్సీ అని అన్నారు. ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ కోసం బీసీ అభ్యర్థులకు ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా ఆరు వేల మందికి ఉచిత శిక్షణ అందజేశామన్నారు. వారిలో 270 మంది టీచర్ ఉద్యోగాలు సాధించడంపై మంత్రి సవిత ఆనందం వ్యక్తంచేశారు.

**ఇకపై ఏటా డీఎస్సీ నోటిఫికేషన్**

ఇకపై ఏటా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారని మంత్రి సవిత తెలిపారు. బీసీ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఏటా ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అత్యధిక బీసీ అభ్యర్థులు టీచర్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**నిరుద్యోగులకు జగన్ దగా...**

మెగా డీఎస్సీ నిర్వహించడం ద్వారా బాబుతోనే జాబు అనే నిరుద్యోగుల భావనను నిజం చేశామని మంత్రి సవిత వెల్లడించారు. నిరుద్యోగుల నమ్మకాన్ని నిలబెట్టుకున్నామన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ జగన్ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతను తీవ్రంగా మోసం చేశాడన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ అనడంతో నిజమేనని నమ్మిన నిరుద్యోగ యువకులు కోచింగ్ సెంటర్లకు వేలకు వేలు ఫీజులు చెల్లించి శిక్షణ పొందారన్నారు. అయిదేళ్లలో ఏనాడూ డీఎస్సీగాని, ఇతర పోటీ పరీక్షలుగాని నిర్వహించకుండా నిరుద్యోగులను జగన్ తీవ్ర నిరాశకు గురిచేశాడన్నారు. ఈ కార్యక్రమంలో నూతన టీచర్లతో పాటు వారి బంధువులు, తల్లిదండ్రులు, కూటమి నాయకులు,

# జీఎస్టీ తగ్గింపు: రైతులకు, ప్రజలకు సంవత్సరానికి 8 వేల కోట్ల లాభం



**ఏలూరు (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వానికి జీఎస్టీ తగ్గింపుతో ఏడాదికి సుమారు 8 వేల కోట్లు నష్టం అయినా, ప్రజలకు అదే మొత్తంలో లాభం కలుగుతోందని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి నెలకు రూ. 3 వేల నుండి రూ. 10 వేల వరకు ఆదా అవుతుందని తెలిపారు.

ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం–బుడ్డగూడెం కాలనీలో సోమవారం నిర్వహించిన 70 ట్రాక్టర్ల ర్యాలీలో మంత్రి స్వయంగా ట్రాక్టర్ నడిపి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అదే ట్రాక్టర్‌పై కూర్చుని రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీ గ్రామ సచివాలయం వరకు చేరింది. అనంతరం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్లో ట్రాక్టర్లు, పరికరాలు పరిశీలించి జీఎస్టీ తగ్గింపుతో కలిగే లాభాలను ప్రజలకు వివరించారు.

మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ, "సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ట్రాక్టర్ల ర్యాలీ, ఎగ్జిబిషన్ నిర్వహించాం. సెప్టెంబరు 22 నుంచి కొత్త జీఎస్టీ స్లాబులు అమల్లోకి వచ్చాయి. వ్యవసాయానికి అవసరమైన పరికరాలు, వస్తువులపై 18%, 12% స్లాబులను ఐక్యపరిచి 5%కి తగ్గించాం. కొన్నింటికి జీరో శాతం వర్తింపజేశాం. రైతులకు ఇది పెద్ద ఊరటనిచ్చే సంస్కరణ" అని అన్నారు. దేశంలో దసరా నుంచి దీపావళి వరకు నెలరోజులపాటు జీఎస్టీ ప్రచారాన్ని కొనసాగిస్తామన్నారు.

జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ, "జీఎస్టీ తగ్గింపుతో ప్రజలు కొనుగోలు చేసే వస్తువుల ధరలు తగ్గి, ప్రతి కుటుంబానికి అదనంగా ఆదా అవుతుంది. జిల్లాలో 30 రోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. కొత్త రేట్లతో పాత రేట్లను పోల్చి చూసినప్పుడు, ప్రజలు ఎంత ఆదా చేసారో అర్థమవుతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, వ్యవసాయ జెడి షేక్ హబీబ్ భాషా, జిల్లా పరిషత్తు సీఈవో వై. శ్రీహరి, యంపిడివో బి.భార్గవి, డిప్యూటీ తహశీల్దారు జి. పవన్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# జీఎస్టీ 2.0 వల్ల ప్రతి కుటుంబానికి రూ.15 వేల ఆదా



○ నిడదవోలులో మంత్రి కందుల దుర్గేష్ ఇంటింటా ప్రచారం

**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణలు పేద, మధ్యతరగతి ప్రజలకు మేలుని చేకూర్చనున్నాయని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని తీరుగూడెంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు.

జీఎస్టీ రేట్లు 5 నుండి 18 శాతం మధ్య మాత్రమే ఉండేలా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల సాధారణ కుటుంబానికి దాదాపు రూ. 15 వేల వం-కు ఆదా కాబోతోందని తెలిపారు. నిత్యావసర వస్తువులు, టీవీలు, సబ్బులు తదితర వస్తువులపై పన్నులు తగ్గడంతో నేరుగా ప్రజలకు లాభం చేకూరనుందని దుర్గేష్ వివరించారు. వ్యాపారులపై పన్ను భారాన్ని తగ్గించి, పన్ను విధానంలో పారదర్శకతను తీసుకొచ్చినందుకు ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు.

తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరగడం, మార్కెట్లో కొత్త పరిశ్రమల స్థాపనకు అవకాశాలు ఏర్పడటం, యువతకు ఉపాధి అవకాశాలు పెరగడం వంటి పాజిటివ్ మార్పులు చోటు చేసుకుంటాయని ఆయన అన్నారు. ఈ జీఎస్టీ సంస్కరణల వల్ల కలిగే లాభాలను ప్రతి కుటుంబం తెలుసుకోవాలని, లబ్ధి పొందాలని మంత్రి పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ 2.0 సంస్కరణలపై ప్రచార పత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన "ప్రజల కోసం అవసరమైన సమయంలో అవసరమైన మార్పులు చేస్తూ రాష్ట్రాన్ని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడపడం కూటమి ప్రభుత్వ ధ్యేయం" అన్నారు.

ఇందుకు ముందు తీరుగూడెంలో దివంగత ఎన్టీఆర్, డా. బి. ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజల సమస్యలు విని పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు.

# ప్రజా నాయకుడు లేళ్ళ అప్పిరెడ్డి



○ కార్పొరేటర్లు సుబ్బారెడ్డి, రోషన్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజల కోసమే జీవించే ప్రజా నాయకుడు లేళ్ళ అప్పిరెడ్డి అని కార్పొరేటర్లు పడాల సుబ్బారెడ్డి, షేక్ రోషన్ కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా పని చేసే పేదల పెన్నిధిగా అభివర్ణించారు.

వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య నేతృత్వంలో శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి జన్మదిన వారోత్సవాలు గుంటూరులో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు అరుణ్, గోపి ఆధ్వర్యంలో బుధవారం సీతమ్మ కాలనీలో నిరుపేదలకు బియ్యం పంపిణీ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కార్పొరేటర్లు పడాల సుబ్బారెడ్డి, షేక్ రోషన్ మాట్లాడుతూ, ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా నేనున్నానని ముందుకొచ్చి వారి సమస్యను సొంత సమస్యగా భావించి, దాన్ని తన భుజస్కంధాలపై మోస్తూ.. వారికి అండదండగా నిలుస్తూ... వారిలో బ్రతుకు పట్ల కొండంత భరోసా నింపే అనితరసాధ్యుడు లేళ్ళ అప్పిరెడ్డి అని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులను చిరునవ్వుతో ఎదుర్కొంటూ ఆయన ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. కష్టపడి పనిచేసే వారిని గుర్తించి పైకి తేవడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థి నేతలు వినోద్, గంటి, రవి, జగదీష్, బాజి, సాజిద్, రాజేష్, అజయ్, కరీం, కిరణ్, బాబి, తేజ, వీరాస్వామి, హొసన్న తదితరులు పాల్గొన్నారు.

# గెలుపు ఒక వాక్యం, ఓటమి ఒక పాఠశాల

○ విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

○ ముగిసిన 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు

○ క్రీడాకారులకు రూ.30 లక్షల ప్రైజ్‌మనీ అందజేత



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్)** క్రీడాకారులకు గెలుపు ఒక వాక్యం, ఓటమి అనేది ఒక పాఠశాల లాంటిదని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో నిర్వహించిన "62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు" బుధవారం ఘనంగా ముగిసాయి. చివరిరోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ చదరంగం బోర్డుపై ముప్పై రెండు గుళికలతో ఆడే ఈ ఆటలో ప్రతి కదలిక ఒక ఆలోచన, ప్రతి తప్పు ఒక పాఠం, ప్రతి విజయము ఒక క్షణికానందమన్నారు. గెలిచిన ఆటగాడి పేరు చెప్పడం సరిపోతుంది. "అతను గెలిచాడు" అని ఒక వాక్యంతో చెప్పేయవచ్చు. అది ఒక గౌరవం, ఆనందం, మధుర జ్ఞాపకం. కానీ గెలుపు అంతటితో ముగిసిపోతుంది. ఓడిన ఆటగాడి కథలో మాత్రం ఎన్నో పాఠాలు దాగి ఉంటాయి. ఎక్కడ పొరపాటు జరిగిందో, ఏ కదలికలో వ్యూహం బలహీనమైందో, ఎలా మారుస్తే తర్వాతి సారి విజయం సాధించగలమో తెలుసుకునే అవకాశం ఓటమి ద్వారా వస్తుంది. ఓటమి అనేది వెనకడుగు కాదు, అది ముందడుగుకు సిద్ధం చేసే ఒక అనుభవ యాత్రని పేర్కొన్నారు. ఆటలో గెలిచిన వారికి శుభాకాంక్షలు చెప్పడం సహజం. కానీ ఓడిన వారినీ అభినందించడం చాలా ముఖ్యమన్నారు. ఎందుకంటే వారు ధైర్యంగా బరిలో నిలబడ్డారు, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. క్రీడలో గెలిచినా, ఓడినా – ఇద్దరికీ చప్పట్లు కొట్టాలి. అదే నిజమైన స్పోర్ట్స్ స్పిరిట్ అని తెలియజేసారు. ప్రతి ఓటమి ఒక పాఠం. ఆ పాఠం ద్వారా వచ్చే సారి మెరుగ్గా ఆడగలమనే విశ్వాసం పెరుగుతుందన్నారు. అనుభవం ఆటగాడిని మరింత బలపరుస్తుందని, ఒక మ్యాచ్ ఓడిపోవడం అంటే కెరీర్ ముగిసిపోవడం కాదన్నారు. అది కొత్త వ్యూహాలకు, కొత్త ఆలోచనలకు, కొత్త విజయాలకు మొదలు మాత్రమేనని అభిప్రాయపడ్డారు. చదరంగం వంటి మేధోక్రీడల్లో విజయాలు సాధించడం ఎంత గొప్ప విషయమో, అదే సమయంలో విద్యను సమాంతరంగా కొనసాగించడం కూడా అంతే ముఖ్యమన్నారు. ఆటలో మాత్రమే కాకుండా, జీవితంలోనూ ఒక బలమైన పునాది ఉండాలన్నారు. విద్య వల్లే ఆటగాడికి భవిష్యత్తులో మరింత అవకాశాలు వస్తాయన్నారు. క్రీడల్లో మెరుగ్గా రాణించేటటువంటి విద్యార్థులకు తమ యూనివర్సిటీలో 100 శాతం ఫీజు రాయితీ కల్పిస్తామన్నారు. అదే విధంగా తమ వర్సిటీ విద్యార్థులకు ఎవరైన కోచింగ్ ఇవ్వాలనుకుంటే వారికి ఉద్యోగ అవకాశాలను కూడా ఇస్తామన్నారు.

**62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల విజేతలు...**

మొదటి స్థానం: తమిళనాడుకు చెందిన గ్రాండ్ మాస్టర్ ఇనియన్ పా కు రూ. 6,00,000 నగదు బహుమతి, మెమోంటో అందించారు.

రెండవ స్థానం:కేరళకు చెందిన 15 ఏళ్ల ఇంటర్నేషనల్ మాస్టర్ హెచ్ గౌతమ్ క్రిష్ణకు రూ. 5,00,000 నగదు బహుమతి, మెమోంటో అందించారు.

మూడవ స్థానం : పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డుకు చెందిన గ్రాండ్ మాస్టర్ శశికిరణ్ క్రిష్ణణ్‌కు రూ. 4,00,000 నగదు బహుమతి, మెమోంటో అందించారు. నాలుగవ స్థానం: రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డుకు చెందిన ఇంటర్నేషనల్ మాస్టర్ ఆయుష్ శర్మకు రూ. 3,00,000 నగదు బహుమతి, మెమోంటో అందించారు. **ఐదవ స్థానం** : రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డుకు చెందిన ఇంటర్నేషనల్ మాస్టర్ ఆరోన్యక్ ఘోష్‌కు రూ. 2,50,000 నగదు బహుమతి, మెమోంటో అందించారు. **ఆరవ స్థానం** : పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డుకు చెందిన గ్రాండ్ మాస్టర్ గుప్త అభిజీత్‌కు రూ. 2,50,000 నగదు బహుమతి, మెమోంటో అందించారు. **ఏడవ స్థానం** : తెలంగాణకు చెందిన విఘ్నేష్ అద్వైత్ వేములకు రూ. 2,00,000 నగదు బహుమతి, మెమోంటో అందించారు. **ఎనిమిదవ స్థానం , తొమ్మిదో స్థానం, పదో స్థానం వరకు బహుమతులు అందజేశారు.**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇంటర్నేషనల్ మాస్టర్ ఎస్.రవితేజకు, ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇంటర్నేషనల్ మాస్టర్ సాహు శేఖర్ చంద్రకు ప్రత్యేక బహుమతులను అందజేసారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటార్ ఆర్. అనంత రామ్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ సీహెచ్ ఏ ఆర్‌కే వర్మ, ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ ముయాంటీయా, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సెక్రటరీ కే.జగదీష్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ కేవీవీ శర్మ, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467